ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 7 | మార్చి 2021

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ|| 150/-
విడి ప్రతి : రూ|| 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

01-12-1987 కాపవరం

రామకృష్ణుడు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 01 డిసెంబర్ 1987, కాపవరం

## గీతాజయంతి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడికి గీత చెప్పిన రోజు. ఇది గ్రంథ రాజం. మనల్ని తరింపచేయటానికి, మనల్ని ఒడ్డుకు చేర్చడానికి, దుఃఖసముద్రం లోంచి బయటపడేయటానికి భగవద్గీత అనే ఒక పుస్తకం చాలు. భగవద్గీతలో భక్తియోగం, కర్మయోగం, ధ్యాన యోగం, జ్ఞానయోగం అని నాలుగు యోగాలే మనకి పైకి కనిపిస్తాయి. కాని మన మనసును నిగ్రహించుకోవటం కోసం మనల్ని బాగు చేసుకోవడం కోసం మనం తరించడం కోసం గీతలో ఎన్నో మార్గాలు చెప్పారు. మనం బాగుపడటం కోసం, మనోనిగ్రహం కోసం, తత్త్వం తెలుసుకోవటం కోసం, భగవంతుడు అర్జునుడిని అడ్డుపెట్టుకుని అనేక విషయాలు, అనేక మార్గాలు మనకి భగవద్గీతలో చెప్పాడు. అందుచేత ఈ భగవద్గీత మనం నిత్యం పారాయణ చేయవలసిన గ్రంథం. ఎందుచేత అంటే మనం గీత తెలుసుకోకుండా, రామాయణం తెలుసుకోకుండా, భారతం తెలుసుకోకుండా మన హిందూ సంస్కృతి గురించి మనకి ఏమీ తెలియదు. మొత్తం వేదాలసారం భారతం అయితే భారతం యొక్క సారం అంతా భగవద్గీత. మీరు భగవద్గీత చదివితే వేదాలు చదివినట్టే, భారతం చదివినట్టే, అన్నీ చదివినట్టే. వేదాలలో మనకి పనికొచ్చే విషయాలు చెప్పారు, ఇంకా అనేక విషయాలు చెప్పారు. కాని మనకి ఏదైతే ముఖ్యమో, ఆ ముఖ్యమైన విషయాలను వేదాల నుండి తీసి భగవద్గీతని ఏర్పరిచారు. భగవంతుడు అంతటి వాడు

ఏమని చెప్పాడు అంటే నేను భగవద్గీతని ఆధారంగా చేసుకుని లోకాలన్నీ పరిపాలిస్తున్నాను అని చెప్పాడు. అందుచేత భగవద్గీతని మనం విడిచి పెట్టకూడదు. మీరు శ్రద్ధగా గీతను చదవండి. ఈ గీతా హృదయం మనకి అర్థం అవ్వాలి అంటే ముందు గీత యందు ప్రేమ కలగాలి. భగవంతుడు యందు ఆశాస్త్రంయందు మనకి గౌరవం కలగాలి. ప్రేమ కలగాలి. అప్పుడు కానీ గీత తన హృదయం మనకి ఇవ్వదు. భగవద్గీత మంచి book కాదు, అందులో ఏమీ ఉండదు అని మనం ముందే కొన్ని నిర్ణయాలకు వచ్చేసి మన మనసుని మూసేసుకుని చదవకూడదు. తెరవబడిన మనసు తోటి, తెరవబడిన హృదయం తోటి, మంచి ఉద్దేశం తోటి అన్నీ నేర్చుకుందాం అనే కుతూహలంతో కనుక మనం భగవద్గీతను చదివితే అనేక కొత్త విషయాలు, మన జీవితంలో ఎప్పుడూ మనకి తెలియని విషయాలు తెలియబడతాయి.

సోదరమహాశయులారా! ఇంకొక చిన్న విషయం ఇది జీవితానికి సంబంధించిన గ్రంథం, కేవలం థియరీ కాదు. మానవజీవితం అంటే ఏమిటి? ఈ భూమి మీదకి మనం ఎందుకు వచ్చాం? మనం మరణించిన తరువాత ఎక్కడికి ప్రయాణం చేస్తాం? మనం తెలుసుకోవాల్సిన విషయం ఏమిటి? జీవితానికి, శాస్త్రానికి ఉన్న సంబంధం ఏమిటి? మనం ఎందుకు పుట్టాం, ఎందుకు బ్రతుకుతున్నాం, మరణం మనకి ఎలా వస్తుంది? ఇటువంటి జీవిత సమస్యలను ఎలా ఎదుర్కోవాలి? జీవితానికి సంబంధించిన విషయాలను భగవద్గీత చెప్పినట్టుగా ఇంక ఏ శాస్త్రం చెప్పదు. అందుచేత జీవితం అంటే ఏమిటో తెలియాలి అంటే గీతను మీరు బాగా చదువుకోండి. మనకి పిరికితనం లేకుండా మనకొచ్చే సమస్యలను మనం పరిష్కరించుకునే శక్తి గీత వల్ల మనకి వస్తుంది. మహాత్మాగాంధీ గారు ఏమి చెప్పారు అంటే జీవితంలో నేను ఎన్నో కష్టాలు పడ్డాను, ఎంతో దుఃఖం అనుభవించాను కానీ ఎంతో దుఃఖం అనుభవించినప్పటికీ ఆ దుఃఖంలో నేను మునిగిపోకుండా భగవద్గీత నన్ను కాసింది అని చెప్పారు. నాకు చిన్నతనంలో తల్లి పోయినప్పటికీ తల్లి లేని లోటు ఈ భగవద్గీత తీర్చింది అని మన జాతిపిత గాంధీజీ చెప్పారు. అందుచేత ఇది సాధకుడికి చాలా ఉపయోగపడే గ్రంథం. సాధన గ్రంథం. ఇందులో మనకి సిద్ధికి సంబంధించిన విషయాలు కంటే సాధన గురించే ఎక్కువ చెప్పారు. ఎందుచేత అంటే సాధన సక్రమంగా జరిగితేనే సిద్ధి కలుగుతుంది. లోకంలో అనేక రకాల మనస్తత్వాలు కలవారు ఉంటారు అందుచేత భగవద్గీతలో మనకి అనేక రకాల విషయాలు క్రోడీకరించి వివరంగా చెప్పుకొచ్చారు. వేదాలలో లేని గొప్పతనం, ఉపనిషత్తులలో లేని గొప్పతనం, పురాణాలలో లేని గొప్పతనం, మనకి భగవద్గీతలో ఉంది. దీనిని క్రమంగా తీర్చి దిద్ది మన ముందు పెట్టాడు భగవంతుడు వాసుదేవస్వామి మనకోసం. అందుచేత మీరు అందరూ కూడా

సాధ్యమైనంత వరకు మీ ఇంటి దగ్గర మీకు అర్థం అయినా, అర్థం అవ్వకపోయినా, మీకు తెలిసినా, తెలియకపోయినా, భగవద్గీతని మీకు చేతనైనంత వరకు చదువుతూ ఉండండి. అదే మీకు మార్గం చూపిస్తుంది.

ఇక్కడ భగవంతుడు సాధన గురించి కొన్ని మాటలు చెప్పాడు. ఏది జ్ఞానం? ఏది అజ్ఞానం? అంటే పుస్తకాలు చదివినంత మాత్రం చేత మనకి జ్ఞానం వచ్చేయదు. పాండిత్యం వస్తుంది. మనకి ఆత్మ తెలియాలి అంటే, జ్ఞానం కలగాలి అంటే, మనం తరించాలి అంటే మనం మోక్షం పొందాలి అంటే ఊరికే పుస్తకాలు చదివితేనే వచ్చేయదు. సద్వస్తువు మన హృదయంలో ఉంది దానిని తెలుసుకోవడానికి తగినటువంటి మార్గాలు ఈ భగవద్గీతలో సూచనలు చేశారు. అవన్నీ కూడా సాధకులు అలవాటు చేసుకోవాలి. సాధన చాలా ముఖ్యం. అమానిత్వం అంటే తన్నుతాను పొగడుకొనకుండుట, నేను గొప్పవాడిని అనే భావన ఎవరిలోనూ పనికిరాదు. సర్వసాధారణంగా ప్రతీవాళ్ళు ఏమి అనుకుంటారు అంటే నేను చాలా గొప్పవాణ్ణి అనుకుంటారు. రూపం చూసుకునో, ఆస్తులు చూసుకునో, బంధువులను చూసుకునో లేకపోతే ఏదోకటి చూసుకునో, మేము చాలా గొప్పవాళ్ళం అని మనసులో అనుకుంటారు. అది మానం, మానం అంటే నేను చాలా గొప్పవాణ్ణి, నేను చాలా అధికుడ్ని అనే భావన. నేను చాలా గొప్పవాణ్ణి, నేను అధికుడ్ని, నన్ను అందరూ గౌరవించాలి ఇటువంటి భావాలు ఉంటే వాడికి చిత్తశుద్ధి కలగదు అని భగవంతుడు వాసుదేవస్వామి చెబుతున్నాడు. అటువంటి భావాలు మీకు ఉంటే, నేను చాలా గొప్పవాణ్ణి అని ఏ జీవుడు అయినా అనుకుంటే మీరు అజ్ఞానులే మీకు ఎవరికీ జ్ఞానం లేదు అని భగవంతుడు స్పష్టంగా చెపుతున్నాడు. నేను గొప్పవాడిని అనే భావన ఎవరిలోనూ పనికిరాదు.

సోదరమహాశయులారా! జీవుడు బాగు పడాలి. జీవుడు అన్నా, మనసు అన్నా ఒక్కటే. జీవుడు బాగు పడాలి అంటే తపస్సు విడిచి పెట్టకూడదు, సత్యాన్ని విడిచి పెట్టకూడదు. తపస్సుని, సత్యాన్ని ఎవడైతే అంటిపెట్టుకున్నాడో వాడు బాగుపడతాడు. వాడు గమ్యాన్ని చేరుకుంటాడు. వాడు ఈ జన్మలోనే తరిస్తాడు. ఇక్కడ భగవంతుడు ఏమి చెబుతున్నాడు నేను అధికుడ్ని నేను అధికుడ్ని అంటే నువ్వు దేవుడిని తెలుసుకోలేవు. ఇటువంటి భావన నీలో ఉండటం వల్ల రెండు నష్టాలు ఉన్నాయి. ఒకటి నువ్వు సమాజ కల్యాణాన్ని పాడు చేస్తావు, సమాజ క్షేమాన్ని పాడుచేస్తావు. నీకు నువ్వు పాడుఅవుతావు. నీ కళ్యాణం కూడా జరగదు. అందుచేత నువ్వు రెండు విధాల కూడా ఇహలోకం లోను పాడైపోతావు. పరలోకం నీకు ఎలాగా లేదు. అందుచేత నేను గొప్పవాడ్ని, నేను ధనవంతుడ్ని, నేను విద్యావంతుడ్ని, నన్ను అందరూ గౌరవించాలి. నేను ఎక్కువ వాడిని అనేటటువంటి భావాలు నీ మనసులోకి రానివ్వకు. అదంబిత్వం అంటే

డంబం పనికిరాదు. డంబం అంటే ఏమిటి? నేను విద్యావంతుడ్ని, నా రూపం చాలా బాగుంటుంది, నా కులం పెద్ద కులం, నీకు తెలియకుండా నువ్వు మనసులో ఇటువంటి దేహభావనని పెట్టుకోవద్దు. ఇటువంటి డంబం మటుకు నీ మనస్సులోకి చేరనివ్వకు. అంటే గర్వం చేరనివ్వకు. మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మంచి costly డ్రెస్ మీరు ఎవరైనా వేసిన రోజున మీకు డంబం వస్తుంది మీరు ఎక్కువ వస్తువులతోటి అలంకరించుకోండి. మీకు తెలియకుండా మీకు డంబం వస్తుంది. ద్వేషం వల్ల డంబం వస్తుంది, అలంకారం వల్ల డంబం వస్తుంది. భాష కూడా కొంతమంది ఆడంబరంగా మాట్లాడతారు. నిదానంగా మాట్లాడరు, వినసొంపుగా మాట్లాడరు, మితంగా మాట్లాడరు, హితవుగా మాట్లాడరు, దానివల్ల కూడా మీకు తెలియకుండా మీకు డంబం పెరుగుతుంది. డంబం పెరిగినప్పుడు పతనం అవ్వటానికి అది దారి తీస్తుంది, అదీ ఇక్కడ భగవంతుడు చెప్పేది. అందుచేత నువ్వు కట్టుకునే బట్టల విషయంలో, నువ్వు తినే తిండి విషయంలో, నువ్వు మాట్లాడే మాటల విషయంలో నిరాడంబరంగానే ఉండు. ఆడంబరం పనికిరాదు. ఆడంబరం కనుక పెరిగితే, నీకు డంబం పెరుగుతుంది. డంబం పెరిగితే నువ్వు పతనం అయ్యిపోతావు.

మనం ఏమి చేస్తున్నాం అంటే భగవంతుడు చెప్పిన మాటలు అన్నీ వదిలేసి పొద్దున్న ఒక గంట సేపు పూజ చేసుకుంటున్నాం. ఎవరి కోసం చేస్తున్నారు అండి పూజ? మీరు పూజ చేయండి, మంచిదే. కానీ ఇక్కడ మీ మనసు ప్రధానం. మనసుని బాగు చేసుకోవటం కోసం, మనసుని నిగ్రహించుకోవటం కోసం, ఇంద్రియాలను నిగ్రహించు కోవటం కోసం, జీవితాన్ని సరిదిద్దుకోవటం కోసం పూజ చేసుకోవాలి. పూజ అంటే ఒక క్రమశిక్షణ. రోజు గుళ్ళోకి వెళ్ళటం కూడా క్రమశిక్షణ కోసమే, ఇవన్నీ జీవితాన్ని క్రమశిక్షణలో పెట్టుకోవటం కోసం మన పెద్దలు చేసిన ఏర్పాట్లు. అందుచేత మీరు గొప్ప మాటలు మాట్లాడకండి, ఆడంబరం లేకుండా మాట్లాడండి. ఆడంబరం లేని బట్టలు తొడగండి. ఆడంబరం లేని జీవితం జీవించండి. ఇంట్లో మీరు చేసుకునే పనులు కూడా ఆడంబరం లేకుండా చేసుకోండి. అలా చేసుకుంటే మీకు ఆత్మ ప్రాప్తి కలుగుతుంది. ఆత్మను తెలుసుకోవటానికి ఏదైతే మీలో అవరోధంగా ఉన్నాయో, అవి అన్నీ నశిస్తాయి. కొంతమంది ఇతరులను హింస పెడతారు. హింసా ప్రవృత్తి ఉన్నవాడికి ఆత్మ తెలియబడదు. అందుచేత హింస పనికిరాదు. హింసకి ఎవడైతే దూరంగా ఉంటున్నాడో, వాడి ఇంద్రియాలు మటుకే స్వాధీనంలోకి వస్తాయి. బుద్ధిలో మృదుత్వం ఉండాలి, మనసులో మృదుత్వం ఉండాలి. క్రూరత్వం ఉన్నవాడికి మటుకు జ్ఞానం కలుగనే కలుగదు. అందుచేత హింస పనికిరాదు. అన్నివిధాల ప్రయత్నం చేసి హింసను విడిచిపెట్టాలి. మన మనసులో హింస ఉంది అనుకోండి మన హృదయం అంతా హింస ఆక్రమించుకుని

ఉంది అనుకోండి మన ఇంద్రియాలు మనకి స్వాధీనంలోకి రావు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఈశ్వరుడి కరుణ లేకుండా మన ఇంద్రియాలు మనకి స్వాధీనంలోకి రావు, మన మనస్సు మనకి స్వాధీనంలోకి రాదు. ఈశ్వర అనుగ్రహం అవసరం, ఈశ్వర అనుగ్రహం ఎవరికి వస్తుంది? సాధకుడికి వస్తుంది. ఈశ్వరుడితోటి మనకు అనుబంధం రావాలి, భగవంతుని అంటిపెట్టుకుని ఉండి భగవంతుని కనుక ప్రార్థిస్తుంటే మన ఇంద్రియాలను జయించటానికి, మన మనస్సుని జయించటానికి, ఈశ్వరుడి యొక్క సహాయం మనకి అందుతుంది. ఎవడైతే సమాజాన్ని దాటలేడో, సమాజం దగ్గర నుంచి మన్ననలు పొందాలి అని ఎవడైతే అనుకుంటున్నాడో వాడు అసలు సాధనకి పనికే రాడు.

వెంకటరత్నం గారు అని రమణాశ్రమంలో ఒకాయన ఉండేవారు. ఆయన భగవాన్ శ్రీ రమణమహర్షి దగ్గర నాలుగు సంవత్సరాలు ఉన్నారు. అందరితోటి ఆయన చేసే పూజ గొడవ, సాధన గొడవ, ఆయన చదివే మంత్రాల గొడవ, ఇవన్నీ చెప్పుకునేవారు. ఆయన చేసుకోవచ్చు, సమాజంలో advertisement ఎందుకు అసలు? నాకు ఓట్లు కావాలి అనుకున్నప్పుడు, నాకు నోట్లు కావాలి అనుకున్నప్పుడు నాకు advertisement కావాలి. Advertisementకి భక్తికి సంబంధం ఏమిటి అసలు? నేను పూజ చేసుకుంటున్నాను అనుకోండి, నేను చేసుకునే పూజ మీకు ఎందుకు తెలియాలి? రమణమహర్షి గారి దగ్గర నాలుగు సంవత్సరాల నుంచి ఆయన నేర్చుకున్నది ఏమిటి? ఉదయం రెండు గంటలసేపు పూజ చేస్తాను? సాయంత్రం రెండు గంటల సేపు చేస్తాను. ఎంతసేపు ఆయన ఇదే గొడవ. సమాజంలో ఈ advertisement ఎందుకు అసలు? మీరు చేసే పూజలకు, సాధనలకు ఈశ్వరుడా సంతోషించవలసినది లేక సమాజమా సంతోషించవలసినది? ఈ మాట ఎందుకు చెబుతున్నాను అంటే మనకి తెలుసుకునే శక్తి లేనప్పుడు, అటువంటి బుద్ధి లేనప్పుడు, మహాత్ముల దగ్గర కూర్చున్నా ఏమి ప్రయోజనం లేదు. భక్తి పేరు మీద, జ్ఞానం పేరు మీద advertisement కాదు మనకి కావలసింది, మనం పవిత్రులం అవ్వడం మనకి కావాలి. మనం పవిత్రులం అవ్వటం కోసం పూజ పెట్టారు, జపం పెట్టారు, ధ్యానం పెట్టారు. మనకి ఈశ్వరుడికి ఉన్న సంబంధం శాశ్వతమైన సంబంధం. మీరు పూజ చేసుకుంటున్నారు. మీరు చేసుకునే పూజకి ఈ ప్రజలకి సంబంధం ఏమిటి? మీరు చేసుకునే జపానికి, సమాజానికి సంబంధం ఏమిటి? అటువంటి advertisement భక్తికి ఈశ్వరుడు సంతోషించడు. ఆ భక్తి దైవీసంపదతో కూడిన భక్తి కాదు. అటువంటి భక్తి రాక్షస భక్తి. కొంతమంది ఎదుటివాడిని సూటి పోటి మాటలు అంటారు. అది కూడా హింసే అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. నువ్వు మాట్లాడేటప్పుడు మృదువుగా మాట్లాడు. ఎదుటివాడికి నొప్పి కలగకుండా మాట్లాడు,

ఎదుటివాడికి అర్థం అయ్యేటట్టు మాట్లాడు. ఎదుటివాడి హితవు కోరి, వాడి క్షేమం కోరి, వాడి బాగు కోరి నువ్వు నాలుగు మాటలు మాట్లాడు. అంతేగాని వాళ్ళని హింస పెట్టడానికి నువ్వు మాట్లాడకు. ఇతరులను హింసపెట్టే మాటలు మాట్లాడుతూ నువ్వు పూజలు చేసినా, జపాలు చేసినా, నీకు జ్ఞానం రాదు. నువ్వు ఎదుటివాడిని హింస పెట్టడానికి మాట్లాడే మాటలు, ఏ మాటలు మాట్లాడినా అది అజ్ఞానమే. ఇది ఇక్కడ భగవంతుడు చెప్పేది. ఎవరైనా చిన్న మాట మనల్ని కష్టమైన మాట అన్నారు అనుకోండి అది అస్తమానూ మననం చేసుకుంటూ ఉండకూడదు. మనిషికి కోరిక అంటూ ఉంటే వాడికి మిగతా దుష్ట గుణాలు తాత్కాలికంగా లేకపోయినప్పటికీ మొత్తం అన్ని చెడ్డ గుణాలని ఈ కోరిక తీసుకు వచ్చేస్తుంది. కామాన్ని జయించావా లోకాన్ని జయించినట్టే. నువ్వు కామాన్ని జయించలేదు, కోరికని జయించలేదు అంటే ఏమీ జయించనట్టే లెక్క.

స్వామి వివేకానంద ఒక మాట చెప్పాడు. ఎవరైనా మిమ్మల్ని ఒకమాట అంటే మీరు క్షమించి దానిని మరచిపోతే అక్కడితో అది ముగిసిపోతుంది. అంతేగాని మీరు ఆ మాటని పట్టుకుని మనసులో తిప్పతూ ఉంటే, మనసులో మోసుకు వెళుతూ ఉంటే అది మీకు ఎంతో బరువు అయిపోతుంది. దానివల్ల మళ్ళీ మీకు ప్రతిహింస చేయాలి అని ఉంటుంది. అందుచేత ఎవరు మిమ్మల్ని విమర్శించినప్పటికీ మీరు మర్చిపోవటానికి ప్రయత్నం చెయ్యండి. ఎవరైనా చిన్న మాట అంటే తట్టుకోలేము అనుకోండి ఇంక మనం ఆత్మని ఎలా తెలుసుకోగలం? ఏ విషయంలో అయినా సరే మనం ఓర్పుగా కనుక ఉంటే, ఓర్పు వల్ల నేర్పు వస్తుంది. ఓర్పు ఎప్పుడు తెలుస్తుంది? సంసారంలోనూ, సమాజంలోనూ మనకు ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు, మనకి పరిస్థితులు అన్నీ వ్యతిరేకంగా ఉన్నప్పుడు కూడా ఓర్పు విడిచి పెట్టకూడదు. అది ఓర్పు అంటే. మనకి పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు ఓర్పుగానే ఉంటారు అందరూ, కానీ వ్యతిరేకంగా ఉన్నప్పుడు కూడా మనసు ఆ balance విడిచి పెట్టకూడదు. గణపతిశాస్త్రి గారు రమణస్వామితో ఏదోక మాటలు చెబుతూ ఉండేవారు, రమణస్వామి అనేవారు ఏమండీ, శాస్త్రి గారు ఇన్ని మాటలు మీరు చెబుతున్నారు. ఈశ్వరుడి మీద భారం వేయటం నేర్చుకోండి ఇంకేమి వద్దు. ఆ శాస్త్రంలో అలా చెప్పారు, ఈ శాస్త్రంలో ఇలా చెప్పారు, ఆ గొడవలు వద్దు, అది కాదు ఇక్కడ ప్రధానం. ఈశ్వరుడి మీద భారం వేసి జీవించటం నేర్చుకోండి శాస్త్రి గారు చాలు అనేవారు. మీకు అందరికి మోక్షం కావాలి. ఏమండీ అందరికి అదే కదా, అందరికి మోక్షం కావాలి. శాశ్వతమైన శాంతి కావాలి, మనం మోక్షం పొందకుండా మనలో ఎవరు అడ్డు వస్తున్నారు మనకి? ఆ శాంతి ఈశ్వరీయశాంతి ఆ మోక్షశాంతి ఎటువంటిది అంటే మీ బుద్ధి ఎంత ఆలోచించినా

అందనటువంటి శాంతి అది, మీ ఇంద్రియాలకు అందదు, మీ బుద్ధికి అందదు, మీ మనసుకు అందదు, మీ ప్రజ్ఞకి అందదు, అటువంటి శాంతి అది మీ హృదయంలోనే ఉంది. ఆ మోక్షం మీ హృదయంలోనే ఉంది, దానికోసం మీరు వెతకక్కర్లేదు. అది మీకోసం వెతుక్కుంటూ మీ దగ్గరకి రాబోతోంది. కానీ ఏమిటి, అది మీ దగ్గరకి వస్తుంటే అడ్డుపడేవి మీ గుణాలు అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఆ మోక్షం మీ కోసం ఎదురు చూస్తోంది. ఆ పరమశాంతి, ఆ శాశ్వతమైనశాంతి మీకు దొరికిన రోజున మీరు ఏ కృష్ణున్ని అయితే దేవుడు దేవుడు అనుకుంటున్నారో, ఆ దేవుడు వచ్చి మీకు కనిపిస్తే ఆయనను చూడాలని కూడా మీకు అనిపించదు. ఆ మోక్ష సుఖాన్ని, ఆ శాంతిని, మానవుడి ప్రజ్ఞ ఊహించలేదు. అది మీ హృదయంలోనే ఉంది, అది మీకోసం ఎదురుచూస్తోంది. దానికోసం నువ్వు వెళ్లక్కర్లేదు. దానికోసం నువ్వు ప్రయాణం చెయ్యక్కర్లేదు. అది నీ కోసం ప్రయాణం చేస్తుంది. అది నీ దగ్గరకి వస్తుంది అది నిన్ను సమీపిస్తుంది. అయితే అది నీ దగ్గరకు రాకుండా బలవంతంగా నీలో ఉన్నటువంటి అసురగుణాలు, ఈ రాక్షసగుణాలు, ఈ డంబము, హింస ఇవి అడ్డు వస్తున్నాయి. మోక్షం వచ్చి మీ మీద పడబోతోంది కానీ ఈ గుణాలు నిన్ను అడ్డుకుంటున్నాయి. వాటిని తీసి మూటకట్టి ఒక పక్కన పెట్టు. మోక్షశాంతి మీకు దగ్గరలోనే ఉంది. అది అన్నిటికంటే సమీపంలో ఉంది. నీ శరీరం కంటే, నీ ఇంద్రియాల కంటే, నీ బుద్ధి కంటే, నీ మనసు కంటే, నాది నాది అనుకునే నీ వస్తువులు కంటే దగ్గరగా, అత్యంత దగ్గరలో ఆ శాంతి నీ హృదయంలో ఉంది. కానీ నీ గుణాలే అడ్డుకుంటున్నాయి. ఈ గుణాలని మూటకట్టి ఒక పక్కన పెట్టు అంటున్నాడు వాసుదేవస్వామి.

ఉన్న వస్తువు ఎప్పుడూ ఉంది. లేని వస్తువుకు ఎప్పుడూ ఉండటం అంటూ లేదు. ఉన్నది మోక్షమే, అది ఎప్పుడూ ఉంది. దానికి లేకపోవటం అంటూ ఏమీ లేదు. మోక్షం అప్పుడు ఉంది, ఇప్పుడు ఉంది. మీరందరూ శాంతిలో ఉన్నారు అని ఈశ్వరుడు చెబుతున్నాడు. మీరు అందరూ మోక్షంలో ఉన్నారని ఈశ్వరుడు చెబుతున్నాడు. మీకు బాధ ఎందుకు వస్తోంది? దుఃఖం ఎందుకు వస్తోంది? అశాంతి ఎందుకు వస్తోంది? ఆర్జవం అంటే కుటిలత్వం లేకపోవటం. కుటిలత్వం పనికి రాదు. వంకర బుద్ధి పనికిరాదు. మీ మనసులో ఉన్నది నోటి తోటి చెప్పరు. నోటితోటి చెప్పేది చేత్తోటి చేయరు. మనసులో ఉన్నది నోటి తోటి చెప్పాలి. నోటితోటి చెప్పేది చేతి తోటి చెయ్యాలి. మనసులో ఒకటి ఉండి, నోటితోటి ఇంకొకటి చెప్పి, చేత్తోటి ఇంకొకటి చేసేవాడికి జ్ఞానం కలగదు. వాళ్లది కుటిల బుద్ధి. బుద్ధిలో వంకర ఉంటే జ్ఞానం కలగదు. బుద్ధిని నిదానం చేసుకోవాలి. బుద్ధిలోని వంకరలు తీసేసుకోవాలి. బుద్ధిలోని వంకరలు తీసేసుకోవటానికే సాధన. అందుకే తపస్సు. మీ మనసుని బాగు చేసుకోవడానికి

ప్రయత్నం చేయండి. శరీరానికి ఉన్న అనారోగ్యం గురించి మీరు కంగారు పడకండి. మనసుని బాగు చేసుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు అంటే నాకు ఇష్టం లేదు. మీ మీద నాకు ప్రేమ లేదు, ఆప్యాయత లేదు, భక్తి లేదు. ఎదురుగా ఉన్న మనిషి మీద నాకు ప్రేమ లేదు. రమణమహర్షి నాకు కనిపించటం లేదు ఆయనని నేను ప్రేమిస్తున్నాను. శ్రీకృష్ణుడు నాకు కనిపించటం లేదు. శ్రీకృష్ణుడిని నేను ప్రేమిస్తున్నాను అంటే అది నిజమా? కనిపిస్తున్న మనుషుల మీద నాకు ప్రేమ లేదు, కనిపించని దేవుళ్ల మీద నాకు ప్రేమ ఉంది? అంటే ఏమిటిది బూటకమా? నిజమా? మాట్లాడరేంటి ఎవరూ? ఇదంతా బూటకం కాకపోతే ఏమిటి? నేను కృష్ణున్ని ప్రేమిస్తున్న మాట అబద్ధమే. కృష్ణున్ని ప్రేమించే శక్తి నాకు నిజంగా ఉంటే మిమ్మల్ని ఎందుకు ప్రేమించలేక పోతున్నాను. అది అబద్ధం. ఇలా అబద్ధపు మాటలు చెప్పి, కాలక్షేపం చేస్తున్నాను. ఇదా సాధన? ఇది భక్తా? ఇది జ్ఞానమా?

సోదరమహాశయులారా! నా గుండెలో ఉన్న మాట ఒకటి చెబుతున్నాను. మనకు విపరీతమైన ఆకలిగా ఉన్నప్పుడు అన్నం దొరకదు అనుకోండి, ఆకలి బాధను తట్టుకోలేక ఎంత దూకుడుగా నా మనస్సు అన్నం మీదకి వెళుతుందో, అంత వేగంగా, అంత దూకుడుగా, అంత తీవ్రంగా, ఎవరికైతే ఆత్మని తెలుసుకోవాలి అనే కాంక్ష, సత్యాన్ని తెలుసుకోవాలి అనే కాంక్ష, హృదయంలోంచి పెల్లుబికి ఆ తపన ఎవడి హృదయంలోంచి వస్తుందో వాడికి ఒక్కడికే జ్ఞానం కలుగుతుంది. ఆకలి లోపల లేకుండా మీరు పది కూరల తోటి అన్నం పెడతారు అనుకోండి నేను తినగలనా? ఎన్ని పుస్తకాలు ఎదురుగా ఉంటే ఏమి లాభం? ఎంతమంది గురువులు ఎదురుగాఉంటే ఏమి లాభం? ఎన్ని శాస్త్రాలు ఎదురుగాఉంటే ఏమి లాభం, నాకు లోపల ఆధ్యాత్మిక ఆకలి లేనప్పుడు, ఆ తపన లేనప్పుడు మనస్సు జ్ఞానంవైపుకు వెళ్లదు. ఈ మాట మీరు ఎవరితోటి చెప్పకండి ఇది జీవన రహస్యం. ఆ తపన మీలో ఎవరికి అయినా ఉందా? మీ హృదయంలో ఘర్షణ రావాలి. తపన రావాలి, అది మీ లోపల నుంచి రావాలి, మీ హృదయాంతరాళాలలో నుంచి రావాలి. అది పైనుంచి పోసేది కాదు లోపల నుంచి ఊరేది. అటువంటి ఆధ్యాత్మిక ఆకలి ఎవడికైతే కలిగిందో, అటువంటి దాహం ఏ సాధకుడికి అయితే కలిగిందో, వాడిని తప్పనిసరిగా ఈశ్వరుడు



**సత్పురుషులతోటి సహవాసం చేస్తే అసలు మీ సాధనతోటి పనిలేదు. మీరు ఎవరి దగ్గరకి వెళ్ళి కూర్చుంటే విపరీతమైన శాంతిని మీరు అనుభవిస్తారో వారే మహాపురుషులు. ఎవడి దగ్గర కూర్చుంటే శాంతి వస్తుందో వాడే నిజమైన మహాత్ముడు!**

అనుగ్రహిస్తాడు. కొంతమందికి ఇదొక హాబీ. కొంతమంది కాలక్షేపానికి సినిమాకు వెళుతూ ఉంటారు. అలాగే కొంతమందికి ఈ భక్తి కాలక్షేపం. పోనీ కాలక్షేపానికి చేసినా మంచిదే. కానీ అంతమాత్రం చేతే మనం ఒడ్డుకు రాలేము. ఆచార్యోపాసన అంటే గురువులకు సేవ చేయాలి. వాసుదేవస్వామి అర్జునుడికి చెబుతున్నాడు గురువులకు సేవ చేయాలి అని, స్వయంగా భగవంతుడే అర్జునుడికి గురువు అయ్యాడు ఇక్కడ, గురువుకు సేవ చేయాలి, గురువు యొక్క అవసరాలు ఏమిటో చూడాలి. అయితే గురువు అంటే ఎవరు? జ్ఞాని మాత్రమే గురువు. మంత్రం చెప్పినంత మాత్రం చేత గురువు కాదు. జ్ఞాని మాత్రమే గురువు. గురువులకి సేవ చేయటం వల్ల శిష్యులను చూసి పొంగి తన హృదయం బయట పెడతాడు. శిష్యుల యొక్క గొప్పతనం బట్టే గురువు హృదయం లోంచి ఆ మాటలు వస్తాయి. గురువు హృదయం నుంచి తీసుకొచ్చే శక్తి శిష్యుడికే ఉంది. గురువు అంటే ఒక వ్యక్తి కాదు, ఆత్మ. అటువంటి గురువును గౌరవించటం వల్ల తన హృదయం పొంగి ఆయన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అయితే అక్కడ కపటం పనికిరాదు.

శౌచం అంటే శుచిగా ఉండటం. ఏమిటి శుచిగా ఉండటం? మన వాక్కులో శుచిగా ఉండాలి. మనస్సులో శుచిగా ఉండాలి. దేహంలో శుచిగా ఉండాలి. మనం దేహాన్ని శుచిగా ఉంచుతున్నాము కానీ లోపల శుచి గొడవ మనకు లేదు. విగ్రహారాధన చేయచ్చునా, చెయ్యకూడదా అని భగవాన్ ని ఎవరో అడిగారు. అప్పుడు భగవాన్ అన్నారు విగ్రహారాధన చేయనివాడు ఈ లోకంలో ఎవడైనా ఉన్నాడా? అదేమిటండి స్వామి అంటే ప్రతివాడు విగ్రహారాధకుడే. ప్రతిరోజూ శరీరానికి అన్నం పెడుతున్నారు. శరీరం కోసం మందులు మింగుతున్నారు. ఈ శరీరం కోసం ఎంతో కాలం ఖర్చు పెడుతున్నారు. డబ్బు ఖర్చు పెడుతున్నారు. ప్రతీ మనిషి విగ్రహారాధకుడే. కానీ భగవంతుడు చెప్పేది ఏమిటంటే, నీ దేహాన్ని ఎంత శుచిగా ఉంచుకోవాలని నువ్వు అనుకుంటున్నావో అదే విధంగా నీ లోపల శుచి, అంతఃకరణంలో శుచి అవసరం. నీళ్ళతోటి దేహానికి స్నానం చేయిస్తున్నారు. ప్రార్థనతోటి, పూజతోటి దైవాన్ని స్మరించడం ద్వారా అంతఃకరణాన్ని, మనస్సుని స్నానం చేయించాలి. మనం భగవంతుడిని ఇంకా చాలా గొప్ప జన్మ రావాలని కోరుకుంటాము, మంచి జన్మ ఎవరికి చెప్పండి, మీరు కోరుకుంటున్నారు కదా, మంచి జన్మ ఎవరికి? మీ అహంకారానికా? ఇంకా మంచి జన్మ వస్తుంది అనుకోండి మీ అహంకారానికి ఇంకా పొగరుబోతుతనం పెరగటానికా? దేనికి మంచి జన్మ? ఓ తండ్రీ నాకు ఏది కావాలో నాకే తెలియదు. నాకు ఏది మంచో నాకే తెలియదు. నీ ఇష్ట ప్రకారం నీకు ఏది ఇవ్వాలి అని ఉంటే అదే నాకు ఇయ్యి. నువ్వు ఏ రకంగా నా జీవితాన్ని నడిపించాలి అనుకుంటే ఆ

రకంగానే నడిపించు అని మనం కోరము. ఈశ్వరుడికి తెలియనట్టుగా ఆయనకి జ్ఞాపకం చేసినట్టుగా మనం అడుగుతాం. దేనికి గొప్ప జన్మ? అహంకారానికా?

స్థైర్యం అంటే చలనం లేకుండా ఉండటం. చాపల్యం లేకుండా ఉండటం. చపలత్వం పనికిరాదు. చపలత్వం ఉంటే ఏకాగ్రత రాదు. ఏకాగ్రత చాలా ముఖ్యం. ఓ అరుణాచలేశ్వరుడా నీలో ఏ దోషము లేదు. ఏ రకమైన దోషము లేని నువ్వు నన్ను కూడా దోష రహితుడని చెయ్యి. దోషం లేనివారితోటి మనం సహవాసం చేద్దాం, వాళ్ళ గుణాలు మనం రాబట్టుకుందాం. ఆ గుణాల యొక్క ఐశ్వర్యాన్ని మనం పొందుదాం అనే తపన ఎవరికి ఉందండి? ఏ సాధకుడికి ఉందండి. ఏవండీ గుణాలు లేకుండా మలాలు పోతాయా? మనలో ఉన్న చెడు గుణాలు పోవాలి అంటే మనలో సద్గుణాలు కావాలి. మన శరీరం మీద ఉన్న మట్టి పోవాలి అంటే నీళ్ళు కావాలి. అదే విధంగా మన మనస్సులో ఉన్న మలం పోవాలి అంటే మన అంతఃకరణంలో ఉన్న మలం పోవాలి అంటే ఏమి కావాలి? సద్గుణాలు కావాలి. సత్పురుషుల యొక్క సహవాసాలు చేసి మంచివాళ్ళను ఆశ్రయించి, దోషం లేని వాళ్ళ పాదాలకు మనం సేవ చేసి, వాళ్ళ గుణాలను మనం పొందితే మనలో ఉన్నటువంటి మలాలు అన్నీ ఊడిపోతాయి. ఆ మలాలు పోయినప్పుడు కదా జ్ఞానం వచ్చేది.

ఆత్మవినిగ్రహః అంటే మనస్సు యొక్క నిగ్రహం కావాలి. మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం అంతే ముఖ్యం. మానవుడి యొక్క మనసుకి, మానవుడి యొక్క శరీరానికి ఉన్న దగ్గర సంబంధం ఇంక దేనికి లేదు. శరీరానికి ఏదైనా దెబ్బ తగిలిందా దాని ప్రభావం వెంటనే వెళ్ళి మనసు మీద పడుతుంది. మనస్సుకి ఎక్కడైనా చిన్న కష్టం కలిగిందా, దాని ప్రభావం వెంటనే వచ్చి శరీరం మీద పడుతుంది. ఈ శరీరం, మనస్సు పెనవేసుకుపోయి ఉంటాయి. చివరికి మరణం వచ్చినప్పుడు కూడా శరీరం గురించి ఆలోచిస్తూ ఉంటుంది మనసు. మేము చాలా బిజీగా ఉన్నాము, మాకు ఖాళీ లేదు, ఖాళీ అయితే ఈ మీటింగులకు వచ్చేవారము అని చెపుతారు. అయితే మీ శరీరాలకు ఏదో ఒక రోజున చావు వస్తుంది కదా మంగళ వారమో, శుక్ర వారమో, ఏదో ఒక రోజున వస్తుంది కదా, ఆ వచ్చినప్పుడు మేము చాలా బిజీగా ఉన్నాము, ఇంకొక రోజున రమ్మంటే చావు వస్తుందా అండి? కానీ భగవంతుడు చెబుతున్నాడు ఒక మాట, ఇప్పుడు చాలా తొందర పడుతూ ఉన్నావు. నీ ప్రాణం పోయే టైములో అయినా నన్ను స్మరిస్తావా? మీరు ఇల్లు కట్టుకోండి, పొలాలు సంపాదించుకోండి, గౌరవాలు సంపాదించుకోండి, మీ ప్రాణం పోయే టైములో నన్ను ఒక్కసారి కృష్ణా, రామా అని అప్పుడైనా

స్మరించుకోండి. మీకు నేను మోక్షం ఇస్తాను, మిమ్మల్ని తరింపజేస్తాను అంటున్నాడు పరమాత్మ. అయితే చివరి క్షణంలో మనం ఆయనను స్మరించగలమా? అది మనం చేయలేము. మీరు ఎవరితో చెప్పకండి. మీ బంధువుల దగ్గర కానీ, మీ స్నేహితుల దగ్గర కానీ, ఇంటికెళ్ళి ఎవరి దగ్గర అనకండి. ఒక చిన్న మాట చెబుతున్నాను. మీ హృదయంలో అనేక కోరికలు ఉంటాయి. మీకు చాలా ఇష్టమైన కోరిక, చాలా బలీయమైన కోరిక, చాలా గాఢమైన కోరిక ఒకటి ఉంటుంది హృదయంలో. కోరికలు అనేకం ఉంటాయి కానీ చాలా గాఢంగా, గూఢంగా నాటుకుపోయి లోతులో ఒక కోరిక ఉంటుంది. అందరికి తలోక రకమైన కోరిక ఉంటుంది. ఆ కోరిక ఏమిటో చెప్పండి మీరు ఎవరైనా? ఏవండి కోరికలు ఎవరికీ లేవా అసలు. ఒకసారి రమణమహర్షి గారి దగ్గరకి ఒక అబ్బాయి వచ్చాడు అండి, సర్వ సాధారణంగా మహర్షి గారు ఇటువంటివి అడగరు. ఆయనేమి అనుకున్నారో ఆ అబ్బాయిని చూసేటప్పటికి ఓ అబ్బాయి నీకు ఏమి కావాలో చెప్పు అన్నారు. ఆ అబ్బాయి నాకు ఏమీ అక్కర్లేదు అన్నాడు. వాడేమిటి భగవాన్ కంటే దర్జాగా చెప్పాడు. అప్పుడు భగవాన్ ఏనాటికి దొరికావురా నా జాతివాడవు. అందరూ ఏదో కావాలి అంటున్నారు. నాకేమి అక్కర్లేదు అని నువ్వు చెబుతున్నావు. నా జాతి వాడవు ఏనాటికి దొరికావు అన్నారు, అంటే ఇపుడు మనం అందరం ఆ కోవలోనే ఉన్నామా అండి? పోనీ ఇప్పుడు చెప్పకండి. మీరు మొహమాట పడచ్చు. జాగ్రత్తగా దాచుకోండి. ఎవరితో చెప్పకండి. ఈ రహస్యాన్ని మీ హృదయంలో దాచుకోండి. కానీ ప్రాణం పోయే టైములో మటుకు మీకు ఆ కోరికే వస్తుంది. భగవంతుడు రాడు. దైవస్మరణ రాదు. మీ హృదయంలో ఏ కోరిక అయితే బలంగా ఉందో, బరువుగా ఉందో ఆ కోరిక మీ ప్రాణం పోయే టైములో తప్పనిసరిగా వచ్చి తీరుతుంది. మీ మాట పడిపోవచ్చు. మీకు లోకానికి సంబంధించిన స్పృహ లేకపోవచ్చు. ప్రాణం పోయే టైములో మటుకి మీకు ఆ కోరికే వస్తుంది. ఏ కోరిక అయితే మీలో బలీయంగా ఉందో రాబోయే జన్మని ఆ కోరిక నిర్ణయిస్తుంది. కనీసం ప్రాణ ప్రయాణ టైములో నన్ను ఒక్కసారి స్మరించండి, మీకు మోక్షం ఇస్తాను అని భగవంతుడు చెప్పిన మాట నిజమే. కానీ ఇది మనవల్ల కాదు. అప్పుడు మనం స్మరించలేము సోదరమహాశయులారా! ఇప్పటినుంచి మీరు ప్రాక్టిస్ చేసినా కానీ స్మరించలేరు. ఎందుచేత అంటే దేవుణ్ణి తెలుసుకోవాలి అనే కోరిక మనలో చిన్న మొక్క రూపంలో ఉంది, మన సొంత కోరికలు పెద్ద పెద్ద వృక్షాల లాగా ఉన్నాయి. ఆ వృక్షాలకి సంబంధించిన కోరికలే వస్తాయి కానీ మొక్కరూపంలో ఉన్న దేవుణ్ణి తెలుసుకోవాలి అనే కోరిక రాదు మనకి. అంటే మీరు ఇప్పుడు చెప్పకండి. ఇప్పుడు చెప్పటానికి సిగ్గు పడుతున్నారు. ప్రాణం పోయే టైములో అప్పుడే మీకు తెలుస్తుంది. అప్పుడు మీ లోపల

ఉన్న బలీయమైన కోరిక వచ్చి నాట్యం చేస్తుంది. ఆ కోరిక ప్రకారం మీకు జన్మ ఇచ్చి తీరాలి ఈశ్వరుడు. అప్పుడు ఈశ్వరుడు మీకు సహాయం చేద్దామన్నా సహాయం చేయలేడు.

త్యాగరాజు గారు ఇంకొక రెండు రోజులలో శరీరం విడిచి పెడతారు అనగా ఆయనకి హడావిడి వచ్చింది అంత మహాభక్తుడికి, అంత మహాత్ముడికి హడావిడి వచ్చింది. మనం ఇంకా తెల్లబట్టలతోటే ఉన్నాం మనం సన్యాసం పుచ్చుకోలేదు. ఇంకొక రెండు రోజులలో పోతాడు అనగా కంగారు పడి ఎర్ర బట్టలు కట్టుకున్నాడు ఆయన. తెల్ల బట్టలు అయితే ఏముంది, ఎర్ర బట్టలు అయితే ఏముంది కానీ మనం సన్యాసం పుచ్చుకోవాలి అనే భావన హృదయాంతరాళంలో ఉంది. అటువంటి చిన్న చిన్న తలంపులు ఉన్నప్పటికీ ఈశ్వరుడు పట్ల ఆరాధన కనుక హృదయంలో ఎక్కువ ఉంటే ఆ ప్రాణ ప్రయాణ టైములో, దేహం పడిపోయే టైములో, చిన్న చిన్న వాంఛలు ఉంటే ఆ వాంఛలను తొలగించి భగవంతుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. అటువంటి చిన్న చిన్న కోరికలు ఉంటే ఆయనే తీసేస్తాడు. మనకున్నవి చిన్న చిన్న కోరికలు కాదే, పెద్ద బరువైన రాళ్ళే. ఇంక భగవంతుడిని ఏమి స్మరిస్తాము. ఏదైతే జీవితం పొడవునా మననం చేశామో, ఏదైతే జీవితం పొడవునా ఆరాధించామో, ఏ విషయం కోసం అయితే జీవితం అంతా ఖర్చు పెడుతున్నామో, ఏ విషయం గురించి అయితే మనం కలలు కంటున్నామో, ప్రాణ ప్రయాణ టైములో ఆ కోరికే మన పీకి పట్టుకుంటుంది, అది మన ప్రయత్నం వల్ల రాదు. అప్రయత్నంగా అదే వచ్చి మనముందు నిలబడుతుంది. మనం ప్రయత్నం చెయ్యక్కర్లేకుండానే వచ్చేస్తుంది. ఎందుచేత? జీవితం అంతా దానికోసం పెట్టాం కాబట్టి. మనసుని ఎవరైనా రెండు నిముషాలు నిగ్రహించుకోండి. ఎవడబ్బ గారి సొమ్ము అండి మనసుని నిగ్రహించుకోవడం, రూపాయి దానం చెయ్యమంటే చేస్తారు మీ మనసుని ఒక నిమిషం నిగ్రహించుకోండి మాకేమి దానాలు వద్దు, ధర్మాలు వద్దు అంటే ఎవరి సొమ్ము అండి మనసుని నిగ్రహించుకోవడం. భగవాన్ ఏమి అన్నారు అంటే మీరు మనస్సును ఆగమంటున్నారు కానీ మీ మనసు కదులుతోంది. మీ మనసును నిగ్రహించుకోలేక పోతున్నారు. నా మనస్సుని కదలమంటున్నాను. నా మనసు కదలటం లేదు అన్నారు. మనకు కోరికలు వస్తున్నాయి, కోరిక అనేది బయట నుంచి రావటం లేదు, లోపల నుంచే వస్తోంది. లోపల ఎక్కడ నుంచి వస్తోంది? అది ఆలోచించండి. నాకు ఒక రకమైన కోరిక వస్తోంది, మీకు ఒక రకమైన కోరిక వస్తోంది. అందరూ మనుషులే కదా, అందరికి కాళ్ళు చేతులు ఉన్నాయి కదా, ఏవండీ అందరూ మనుషులే కదా మరి మీకు ఒకరకమైన కోరిక నాకు ఒకరకమైన కోరిక రావటానికి కారణం ఏమిటి? ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. నాకు కోరిక వస్తోంది. ఆ కోరిక ఎక్కడ నుంచి

వస్తోంది? దానికి సంబంధించిన వాసన నాలో ఉంది కాబట్టి వస్తుంది. వాసన ఎక్కడ నుంచి వచ్చింది? పూర్వజన్మల్లో ఏ పని అయితే నేను ఇష్టం తోటి చేశానో అది మంచి పని అవ్వచ్చు, చెడ్డ పని అవ్వచ్చు, ఏ పని అయితే నేను ఇష్టం తోటి చేశానో, ఆ ఇష్టం తోటి చేసిన పని మర్చిపోయాం కాని అదే వాసనరూపంలో నా హృదయంలో ఉంది. ఆ వాసనే కోరిక కింద వస్తుంది. కోరిక కింద వచ్చి బుర్రలో విజృంభిస్తుంది. మీరు ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోండి. మీకు అందరికి తరచుగా మనసులో ఏ కోరికలు అయితే వస్తున్నాయో దానికి సంబంధించిన పనులు మీరు పూర్వజన్మలో చేసినట్టు గుర్తు. అందరం మనుషులమే కానీ కోరిక మటుకు ఒకేరకమైన కోరిక రాదు. అందరికి తలొక రకమైన కోరిక వస్తుంది. అంటే ఏమిటి ఎవరికి ఏ కోరిక అయితే ప్రీతిగా వస్తుందో, అది పూర్వజన్మలో వాళ్ళు ఆచరించారు. పూర్వజన్మలో ఇష్టంగా చేశారు. ఇవాళ వాటిని పొమ్మంటున్నారు. ఎక్కడికి పోతాయి అవి? పూర్వజన్మలో మనం ఇష్టంగా చేశాము. మనం ఇష్టంగా చేసిన పనులే ఇప్పుడు వాసనల రూపంలో మనలో ఉన్నాయి. ఇప్పుడు అవేమో మనకి దుఃఖాన్ని తీసుకువస్తున్నాయి. అవి దుఃఖాన్ని తీసుకు వస్తున్నాయి అని వాటిని బయటికి పొమ్మంటున్నారు. నీ హృదయంలో నేను చాలా కాలం నుంచి ఉంటున్నాను. ఇవాళ పొమ్మంటే నేను పోతానా అంటుంది. పూర్వం ఎంత ఇష్టం తోటి అయితే మనం ఆ కోరికలను పెంచుకున్నామో అంత ఇష్టం తోటి వాటి వ్యతిరేక భావాలను మనం ప్రాక్టీస్ చేస్తే అవి పోతాయి. కష్టం తోటి చేయకూడదు, ఇష్టం తోటి చెయ్యాలి.

ఇంద్రియార్థేషు వైరాగ్యం. విషయముల పట్ల వైరాగ్యం కావాలి అని ఇక్కడ భగవంతుడు చెబుతున్నాడు. వైరాగ్యాన్ని సంపాదించుకోమంటున్నాడు. అంటే విషయ చింతన పట్ల వైరాగ్యం ఉండాలి. అంటే విషయాల పట్ల ఆసక్తి ఉండకూడదు. మన పని ఏదో మనం చేసుకోవాలి కానీ లోకంలో విషయాలను నొల్లుకొన్నట్టు మనం ఉండకూడదు. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఇవి మూడు మనిషిని పీడించేస్తాయి. శాస్త్రవాసన, లోకవాసన విడిచి పెడతాయేమో కానీ దేహవాసన అసలు విడిచిపెట్టనే విడిచిపెట్టదు. అందుచేత ఇక్కడ భగవంతుడు ఏమి చెబుతున్నాడు అంటే వైరాగ్యం చాలా ముఖ్యం. వైరాగ్యం నిజంగా మనకి ఉంది అనుకోండి వాడి మనసు చలించదు. అంటే మీకు విషయ చింతన వద్దు. విషయ చింతన పట్ల వైరాగ్యం కలిగి ఉండు. వైరాగ్యం మీకు లేదు అనుకోండి వైరాగ్యాన్ని సంపాదించుకోండి.

వైరాగ్యం ఎవరికి వస్తుంది? నీ గురించి నువ్వు ఆలోచిస్తుంటే నీకు వైరాగ్యం వస్తుందా? ఎవరికి వస్తుంది వైరాగ్యం? ఇహంలో కాని, పరంలో కానీ ఏమి ఆశించకుండా

ఇంటిదగ్గర నీ పిల్లలకి సేవ చేసినప్పటికీ, మీ భర్తకి మీరు సేవ చేసినప్పటికీ ఈశ్వరార్పణంగా చేస్తే, మీరు సమాజానికి సేవ చేసినప్పటికీ తిరిగి returns అక్కర్లేకుండా కేవలం ఈశ్వరార్పణంగా చేస్తే, కర్మఫల త్యాగం చేస్తే వాడికి వైరాగ్యం వస్తుంది. మనం కర్మ చేస్తున్నాం, ఫలితాన్ని కోరుతున్నాం, కర్మఫలాన్ని ఎవడైతే విడిచిపెడుతున్నాడో వాడే త్యాగి, వాడే సన్యాసి, వాడే యోగి అని భగవంతుడు చెపుతున్నాడు. మనం కర్మ చేస్తున్నాం, ఫలితం మనకి వచ్చేయాలి. మనం యోగులం ఎలా అవుతాము? యోగి ఎవడు అవుతాడు? ఎవడి హృదయం అయితే పవిత్రం అయ్యిందో, ఎవడి బుద్ధి అయితే పవిత్రం అయ్యిందో వాడు యోగి అవుతాడు. ఈశ్వరార్పణంగా పనిచేస్తే వాడికి వైరాగ్యం కలుగుతుంది. మనం ఏమి చేస్తున్నాం? కర్మ చేస్తున్నాం. మంచి కర్మలు కూడా మనం చేస్తున్నాం, మంచి కర్మల ఫలితాన్ని కూడా మనం కోరుతున్నాం. అందుచేత ఫలితం మనకి వస్తుంది. మనం ఇలాగే ఉంటాం. ఒక మంచి పని చేసి మర్చిపోయిన వారు ఎవరైనా ఉన్నారా? చెప్పండి మంచి పని చేసి మీరు ఎవరైనా మర్చిపోయారా? ఎవరైతే ఈశ్వరార్పితంగా పని చేస్తున్నారో, ఈశ్వరార్పితంగా మాట్లాడుతున్నారో, వచ్చిన మంచి తలంపులను కూడా ఈశ్వరార్పితంగా ఎవరైతే చేస్తున్నారో, ఎవడైతే ఈశ్వరార్పితంగా, హృదయ పూర్వకంగా పని చేస్తూ ఫలితాన్ని ఎవడైతే త్యాగం చేస్తున్నాడో, వాడికి వైరాగ్యం కలుగుతుంది. వైరాగ్యం లేనివాడికి జ్ఞానం కలగనే కలగదు. వాడు ఎన్ని గ్రంథాలు చదివినా సరే, వాడికి ఎంత పాండిత్యం ఉన్నా సరే, వైరాగ్యం లేనివాడికి జ్ఞానం కలగనే కలగదు. వైరాగ్యం లేకపోతే సంపాదించుకోమంటున్నాడు భగవంతుడు. మీరు దైనందిన జీవితంలో చేసుకునే పని ఈశ్వరార్పణంగా చేయండి. మీ పిల్లలకు మీరు సేవ చేస్తారు. ఈశ్వరార్పితంగా చేయండి. ఈశ్వరార్పితంగా మీ పిల్లలకు కూడా మీరు చేయరు. మీ పిల్లలు పెద్ద అయ్యాక మిమ్మల్ని చూడరు అనుకోండి చిన్నప్పుడు ఇంత కష్టపడి పెంచాం, మమ్మల్ని చూడటం లేదు అంటారు. అంటే ఏమిటి ఈశ్వరార్పితంగా మీరు చేయలేదు అని అర్థం. ఇంక మీరు లోకానికి ఏమి చేస్తారు? మీ ఇంట్లో ఉన్న వ్యక్తులకే మీరు ఈశ్వరార్పితంగా పని చేయలేనప్పుడు ఇంక సమాజానికి ఏమి చేస్తారు? ఎందుకు మెట్ట వేదాంతం? ఇంట్లో చేసే పనులు ఈశ్వరార్పితంగా చేయండి మీకు జ్ఞానం కలుగుతుంది. మీరు ఏదైనా మంచి పని చేయండి. ఏమి ఆశించకుండా ఫలితాన్ని మీరు త్యాగం చేయండి. మీకు ఎంత సంతోషం వస్తుందో మీ జీవితంలో మీరు చూడండి. మీ బిడ్డలకి అన్నం పెట్టేటప్పుడు కూడా ఈశ్వరభావంతో అన్నం పెట్టండి చాలు, అప్పుడు మీకు ఎంత సంతోషం వస్తుందో మీరు చూడండి.

అనహంకారః అనహంకారం అంటే అహంకారం లేకుండా ఉండటం. ఈ నేనే

అహంకారం. మనం ఏదైతే నేను నేను అంటున్నామో అదే అహంకారం. మనం చేసే పూజలు, జపాలు ఈ నేనును అలంకరించుకోవటం కోసమే. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటంటే ఎప్పుడో మాట అటు ఉంచు, ఈ లోకంలో ఉండగా, ఈ దేహంలో ఉండగా, అహంకారం లేని స్థితి ఎలా ఉంటుందో నువ్వు చూడు. అహంకారం లేని స్థితిని నువ్వు పొందు. అప్పుడు నీకు మోక్షం అంటే ఏమిటో తెలుస్తుంది. మరణానంతర జీవితం కాదు. ఈ శరీరంలో ఉండగా ప్రాణం పోకముందే అహంకారం యొక్క వేగాన్ని తగ్గించుకుని అహంకారం లేని స్థితిని పొందు. ఇప్పుడే పొందు, ఇక్కడే పొందు. ఈ శరీరం ఉండగానే పొందు, అప్పుడు నీకు మోక్షం యొక్క రుచి తెలుస్తుంది. ఆ సుప్రీం happiness నీకు తెలుస్తుంది. ఒక రహస్యం మీరు కడుపులో పెట్టుకోండి. కోరికలు ఉండకూడదు అంటారు ఇవన్నీ కాలక్షేప కబుర్లు. నా హృదయంలో ఉన్న మాట చెబుతాను. కోరికలు రాకూడదు అని నేను మీకు చెపుతాను అయితే కోరికలు మీకు రాకుండా ఆగుతాయా? ఆగవు. ఎందుకొచ్చిన ఈ మాటలు. ఒక చిన్న విషయం ఇక్కడ ఉంది. పరిపూర్ణమైన సుఖం, ఆ సుప్రీం happiness, హృదయంలో ఉన్న ఆ సుఖం, శాంతి మీకు దొరికే వరకు కోరిక వస్తూనే ఉంటుంది. ఆ సుఖం వాడి చేతికి దొరికాక, ఆ శాంతి వాడికి దొరికాక, లోకంలో ఏ కోరిక వాడికి సంతృప్తిని ఇవ్వదు. ఏ సుఖాన్ని నీకు లోకం ఇవ్వలేదో, ఏ శాంతిని నీకు లోకం ఇవ్వలేదో, ఏ సంతృప్తిని నీకు లోకం ఇవ్వలేదో, అటువంటి సంతృప్తి, అటువంటి సుఖం, అటువంటి శాంతి మీ హృదయంలోనే ఉన్నాయి. అటువంటి సుఖం, అటువంటి శాంతి మీ చేతికి అందాక అప్పుడు మీ మనసు కదలమంటే కదలదు. మెదలమంటే మెదలదు. లోకం వైపు పరుగెట్టమంటే పరుగెట్టదు. వాంఛ పుట్టదు. అప్పుడు మీకు ఈ లోకంలో కోరికలు నెరవేరినప్పటికీ నీ హృదయంలో ఉన్న సంతృప్తి తోటి, ఆ సంతృప్తిని పోల్చుకుంటే సూర్యుడు ముందు దీపం వెలిగించినట్టు ఉంటుంది. ఏ సంతృప్తిని మీరు పొందాక అట్టి సంతృప్తిని లోకం ఇవ్వలేదో, ఎట్టి శాంతిని మీరు పొందాక, అట్టి శాంతిని లోకం ఇవ్వలేదో, ఎట్టి సుఖాన్ని మీరు పొందాక అట్టి సుఖాన్ని లోకం ఇవ్వలేదో, ఆ సంతృప్తి సుఖం మీకు కలిగేవరకు కోరికలు వస్తూనే ఉంటాయి. మీరు ఒకటే జ్ఞాపకం ఉంచుకోండి అంతవరకు కూడా మీ కోరికలు ఆగమంటే ఆగవు. మీరు ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని గ్రంధాలు చదివినా కోరికలు రావటం ఆగవు. నన్ను చూస్తే మీకు శాంతి కలగదు అనుకోండి నేను అసలు ఉపన్యాసం చెప్పటానికి పనికిరాను. నన్ను చూసిన వెంటనే మీకు శాంతి కలగకపోతే నాలో ఏదో దోషం ఉంది అని అర్థం. స్వర్గ రాజ్యం, మోక్ష రాజ్యం, దైవ రాజ్యం, శాంతి రాజ్యం, జ్ఞాన రాజ్యం మీ హృదయంలోనే ఉంది. అహంకారం

దానిని అడ్డుకుంటోంది. అహంకారాన్ని తొలగించుకో, ఎప్పుడో మరణానంతర జీవితం మాటలు వద్దు. అరువు బేరాలు వద్దు ఇప్పుడే నువ్వు అహంకారం లేని స్థితికి ఎదుగు.

జన్మ మృత్యు జర వ్యాధి దుఃఖ దోషాని దర్శనం. జన్మలో ఉన్న దోషం, ముసలితనంలో ఉన్న దోషం, రోగంలో ఉన్న దోషం, ఈ దోషాలని చూడు. జన్మ అంటే ఏమిటి? ముసలితనం అంటే ఏమిటి? రోగం అంటే ఏమిటి? వాటిలో వచ్చిన కష్టం ఏమిటి? అసలు ఈ భూమి మీదకి రావటం వల్ల వచ్చే దోషం ఏమిటి? ఆ విషయాలు మీరు గ్రహించండి. ఏకాంతంగా కూర్చుని విచారణ చెయ్యి. అందులో ఉన్న దోషాలని గ్రహించు. ఆ దోషానికి దూరంగా ఉండు. ఎప్పుడైతే మనకి పుట్టుక వచ్చిందో అప్పుడు మరణం వస్తుంది. పుట్టుక వచ్చినప్పుడు రోగం వస్తుంది, ముసలితనం వస్తుంది. భగవాన్ చెప్పేవారు మరణించిన వాళ్ళు అందరూ బాగానే ఉన్నారు. బ్రతికి ఉన్నవాళ్ళు మరణించిన వాళ్ళు గురించి ఏడుస్తున్నారు అని. భగవాన్ కొన్ని రోజులకి శరీరం విడిచి పెడతారు అనగా వేదంలో మృత్యుంజయ మంత్రాలు అని ఉంటాయి. అంటే ఏమిటి? మృత్యువు రాకుండా మంత్రాలు పారాయణ చేయటం. పండితులను పెట్టి వాటిని పారాయణ చేయిస్తున్నారు. భగవాన్‌తో చెప్పారట భగవాన్ మీకు మరణం రాకుండా పండితులతో మంత్రాలు చదివిస్తున్నారు, అప్పుడు భగవాన్ అన్నారట ఏమండీ ఈ మంత్రాలు రాసినవారు అందరూ ఇప్పుడు బ్రతికి ఉన్నారా? చచ్చిపోయారా? అని అడిగారు, వాళ్ళు అందరూ పోయారు అండి. వాళ్ళు అందరికి ఏ గతి పట్టిందో ఈ దేహానికి అటువంటి గతే పడుతుంది అన్నారు. స్వామి స్వామి మీ విగ్రహం మద్రాసులో తయారయ్యిపోయింది. ఇంకా పది రోజులలో వచ్చేస్తుంది అని చెపితే. అప్పుడు భగవాన్ అన్నారట అవును మరి రాతి మనుషులకి రాతి విగ్రహాలు ఉండాలి. కొంతమంది సజీవంగా ఉన్న మనుషులని ప్రేమించలేరు. సజీవంగా ఉన్న మనుషులని చూడలేరు. ఎంతసేపు రాళ్ళు, రప్పలు కావాలి.

భగవాన్ ఒక మాట చెప్పారు. ఆ రోగం వచ్చిందని ఈ రోగం వచ్చిందని అందరూ అంటూ ఉంటారు. శరీరంమే ఒక రోగం అన్న సంగతి తెలియటం లేదు. శరీరం ఒక రోగం రోగానికి రోగం రావడంలో ఆశ్చర్యం ఏముంది? రోగానికి రోగం వస్తుంది. లోకంలోని విషయాల పట్ల ఆసక్తి పనికిరాదు. మీకు దుఃఖం వస్తుంది అంటే ఒక్కటే కారణం. ఆసక్తి

**ఆత్మని అన్వేషించటం మానేసి ఊర్లో ఏమి జరుగుతోంది?**
**పేపర్లో ఏమి రాశారు? ఇవన్నీ తెలుసుకోవాలి అని మీకు ఉంటుంది.**
**ఇదే పెద్ద మాయ! ఏమి జరుగుతుంది?**
**ఎక్కడ చూసినా లోకంలో రాగద్వేషాలే!**



వల్ల దుఃఖం వస్తుంది, అంటే మీరు పని చేయవచ్చును కానీ ఆసక్తి పనికిరాదు. పని చేసి వదిలేయండి. ఇప్పుడు నేను ఏదో నాలుగు మాటలు చెబుతున్నాను. వాటి ప్రభావం మీ మీద ఉండచ్చు. మీ మీద లేకపోవచ్చు. ఆ మాటలు మీలో కొంతమందికి నచ్చవచ్చు, కొంతమందికి నచ్చకపోవచ్చు. నేను చెప్పేది హృదయపూర్వకంగా చెప్పి బయటకి వెళ్ళిపోవాలి. నేను ఆసక్తి పెట్టుకోకూడదు. ఆ మాటలు మీకు పనిచేయవచ్చు, పనిచేయకపోవచ్చు. నేను చెప్పేది హృదయ పూర్వకంగా చెప్పి బయటకి పోవాలి. ఎంతమందికి ఈ ఉపన్యాసం పనిచేసింది? ఎంతవరకు పని చేయలేదు. ఈ మాటలు ఎవరికయినా ఉపయోగపడ్డాయా లేదా అని ఇటువంటి తర్కం నాకు పనికిరాదు. అలా తర్కిస్తూ ఉంటే నాకు ఆసక్తి ఉన్నట్లే. ఒకసారి స్వామి చిన్మయానంద బెజవాడ వచ్చారు. అంటే 1955 - 56 ఆ ప్రాంతంలో అప్పుడు నా కళ్ళతోటి నేను చూసిన దృశ్యం మీకు చెబుతాను. ఎవరో పళ్ళెంలో వెండి రూపాయలు పెట్టి స్వామికి ఇచ్చి నమస్కారం పెట్టారు. స్వామి ఏమి చేశారు ఆ రూపాయలు విసిరేసి ఎవరికి కావలసింది వాళ్ళు ఏరుకోండి అన్నారు. ఆ రూపాయలు ఎవరు ముట్టుకుంటారు? ఎవరు ముట్టుకోరు. అక్కడకి వచ్చినవాళ్ళు అందరూ భక్తులే. ఆ దానం చేసినవాడు మటుకు వాటివంక అలా చూస్తున్నాడు. అంటే అతని ఉద్దేశం ఏమిటి? నేను ఇంత ప్రేమగా ఇచ్చాను, ఇంత భక్తిగా ఇచ్చాను. రూపాయలు విసిరేసారు అని, వీడు ఇచ్చేశాడు కదా ఆసక్తితో ఇచ్చాడా? ఆసక్తి లేకుండా ఇచ్చాడా? అని స్వామి చూస్తున్నారు. ఆసక్తితో ఇచ్చాడు కాబట్టి ఆ రూపాయలు అలా గుమ్మరించేటప్పటికీ వాడికి బాధ వస్తుంది. వాడికి ఆసక్తి లేదు అనుకోండి స్వామివారు అక్కడ పంచి పెట్టేసినా వాడికి దుఃఖం రాదు. అది మనల్ని నేర్చుకోమంటున్నారు. మీ ఇంటికి ఎవరైనా వస్తారు. మీరు హృదయపూర్వకంగా మర్యాద చెయ్యటమే. తర్వాత మర్యాద చేయించుకున్నవారు, మీరు మర్యాద బాగా చేశారు అనుకోవచ్చు. చెయ్యలేదు అనుకోవచ్చు రకరకాలుగా అనుకోవచ్చు. మీకు అది అనవసరం. మీ ఇంటికి వచ్చిన వాళ్ళు దేవతలతో సమానం అనుకుని వాళ్ళని హృదయపూర్వకంగా మీరు ఆరాధించండి. ఆసక్తి లేకుండా పని చేయండి. ఆసక్తి లేకుండా పని చేస్తే మీకు దుఃఖం పుట్టదు. ఇది కృష్ణుడు చెప్పిన రహస్యం. మీరు ఏ పని చేసినా సరే ఆసక్తి పనికిరాదు. ఆసక్తి లేకుండా పనిచేస్తే మీరు ఎంత పని చేసినా సరే అది మిమ్మల్ని బంధించదు. ఈ లోకంలో మీరు సుఖపడతారు. పరలోకంలో సుఖపడతారు. అందుచేత ఆసక్తి పనికిరాదు. మీరు జపం చేయండి, ధ్యానం చేయండి. మీరు చేసే పని హృదయపూర్వకంగా మీరు చేసేయడమే. ఈశ్వరుడ్ని మటుకు మీరు ఏ విషయంలోను బలవంతం పెట్టకండి.

అభిష్వంగం అంటే అంటి పెట్టుకుని ఉండకూడదు. కొంతమంది మంచి పని చేస్తారు

కానీ అంటిపెట్టుకుని ఉంటారు. అంటే మేము అది చేశాం, ఎవరు మెచ్చుకోవటం లేదు ఏంటి? ఎవరు మమ్మల్ని పొగడటం లేదేంటి? ఇలా మనస్సు తోటి అంటిపెట్టుకుని ఉంటారు. అది కూడా చెడ్డలక్షణం అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. పూజ చేయచ్చు, జపం చేయచ్చు, నాకు ఇంత ఫలితం వస్తుంది, అంత ఫలితం వస్తుంది అని మనసులో దానిని మోయకండి. ఆ బరువు మీరు మోయవద్దు. చేసేది ఏదో హృదయ పూర్వకంగా చేయండి. కొంతమంది అంటారు కష్టపడి చదువు చెప్పించాం అండి, మరి ఇప్పుడు మమ్మల్ని పలకరించడం వాళ్లకి బరువు అయిపోయింది అంటారు. పలకరిస్తే మీకు ఏమి వస్తుంది అండి? పలకరిస్తే ఒక మానసికమైన సంతృప్తి. ఆ సంతృప్తి మీరు ఈశ్వరుడి నుండి పొందలేరా? ఆ మాత్రం సంతోషం, ఆ మాత్రం సంతృప్తి మీ హృదయం నుండి మీరు తీసుకోలేరా? మీ హృదయంలో భగవంతుడు లేడా? భగవంతుడు చెప్పేది మీరు శివస్వరూపం అని చెబుతున్నాడా? శవస్వరూపం అని చెబుతున్నాడా? ఎవరో మాట్లాడితే మనకి ఆనందం రావడం ఏమిటి? మాట్లాడటం మానేస్తే దుఃఖం రావడం ఏమిటి? అది సాధకుల లక్షణమా? సహవాసం చేయడానికి సత్పురుషులు దొరకకపోతే అడవిలో ఏనుగు తిరిగినట్టు ఒంటరిగా ఈ సమాజంలో జీవించు అన్నాడు గౌతమబుద్ధుడు. మధ్వాచార్యులు గారు ఒక మాట చెప్పారు నువ్వు పులి నోట్లో పడ్డా నాకు ఇష్టమే. కాని దుష్టుల చేతిలో మటుకు పడకు. పులి నోట్లో పడినా నాకు ఇష్టమే పులి నోట్లో పడితే ఆ శరీరం పోతుంది. కానీ దుష్టుల చేతిలో మటుకు పడకు. దుష్టుల చేతిలోపడితే భవిష్యత్‌లో అనేక నీచ జన్మలు ప్రాప్తిస్తాయి. బట్టలు కొనుక్కునేటప్పుడు selection, కూర తినేటప్పుడు selection, కానీ స్నేహాలు చేసేటప్పుడు selection అక్కర్లేదు. పుస్తకాలు చదివేటప్పుడు selection అక్కర్లేదు. ఇక్కడ కృష్ణుడు చెబుతున్నాడు నువ్వు గృహస్థ ఆశ్రమంలో ఉండచ్చు. గృహస్థ ఆశ్రమంలో ఉన్నప్పటికీ అంటి పెట్టుకున్నట్టు ఉండకూడదు. రామకృష్ణ పరమహంస గారు చెప్పారు చూడండి నీటిలో పడవ ఉండచ్చు. కానీ పడవలో నీళ్ళు ఉండకూడదు. రమణమహర్షి గారి దగ్గరకి ఒక బీదవాడు వచ్చాడు అటండి. స్వామి స్వామి అరటిపళ్ళు కూడా తేకుండా ఒట్టి చేతులతోటి వచ్చాను. నా దగ్గర ఏమీ లేదు అన్నాడు అటండి. భగవాన్ అన్నారు ఏమీ తేలేదు అంటావేమిటి? నేనుని తెచ్చావు కదా, నువ్వు నేను నేను అంటున్నావు కదా, నేనుని మోసుకు వచ్చావు కదా నాకు కావలసింది ఆ నేనే. ఏమిటి అందరికి నేను ఉంది. ఈ నేను ఎవరు? ఈ శరీరానికి పరిమితం అయిన ఈ నేను ఎవరు? విచారణ చెయ్యండి, ఆలోచించండి. విచారణే తపస్సు, ఆలోచనే తపస్సు, చింతించటమే తపస్సు. తపస్సు చేయండి శరీరానికి పరిమితం అయిన నేను మటుకు అది కేవలము అహంకారమే. శరీరానికి పరిమితం అయిన నేను, నా మనస్సుకి పరిమితం అయిన

నేను, నా బుద్ధికి పరిమితం అయిన నేను, ఈ నేను నాలో ఉన్న మాట నిజమే. కాని ఇది ఆత్మ కాదు. ఇది సత్యం కాదు, ఇది బ్రహ్మం కాదు. ఇది కేవలం అహంకారం మాత్రమే. మనం రోజు అనుకునే ఈ నేను, ఇది నిజమైన నేను కాదు. ఇది బ్రహ్మగతమైన నేను కాదు. ఇది ఆత్మగతమైన నేను కాదు. ఇది సత్యగతమైన నేను కాదు. ఇది అహంకార గతమైన నేను మాత్రమే. ఈ నేనుని శరీరంలో అట్టే పెట్టుకోమనటం లేదు. నేనుని జయించటానికే కదా జన్మ. రమణమహర్షిగారు నేను నేను అని చెప్పారు. నేను అంటే ఎవరు? నేను అంటే మనస్సే. మనం మనస్సు మనస్సు అని ఏదైతే అనుకుంటున్నామో, అహంకారం అహంకారం అని దేనినైతే అనుకుంటున్నామో, అదే నేను అని చెప్పాడు. అంటే దీని గురించి మీరు కంగారు పడక్కర్లేదు. నువ్వు సంసారంలో ఉన్నప్పటికీ పుత్రుల మధ్య, భార్య మధ్య, బంధువుల మధ్య, స్నేహితుల మధ్య ఉన్నప్పటికీ నువ్వు ఆసక్తి పెట్టుకోకు. నువ్వు ఉండు కానీ ఆసక్తి మటుకు లేకుండా ఉండు. మన ఇంట్లో ఎవరైనా పోతే మనకి దుఃఖం వచ్చేస్తుంది. పక్కింట్లో ఎవరైనా పోయారు అనుకోండి ఏమీ రాదు. రైలు ప్రమాదం జరిగింది వంద మంది చచ్చిపోయారు అని పేపర్‌లో చదువుతాం. ఒక్క కన్నీటి చుక్క రాదు మనకి, మన ఇంట్లో ఎవరైనా పోతే మటుకు ఏడుస్తాం. మన ఇంట్లో వాళ్ళు పోతే మనం ఎందుకు ఏడుస్తాం అంటే వాళ్ళ మీద నిజంగా ప్రేమ ఉండి కాదు. మళ్ళీ మన యొక్క సుఖానికి, మన comfortకి ఎక్కడ భంగం వస్తుందో అని, అక్కడ కూడా మన స్వార్థమే. లోపల ఉన్నది స్వార్థం. పైకి ఉన్నది ప్రేమ, ఆప్యాయత. ఇవన్నీ దొంగ మాటలు. మీ సంసారంలో ఉండచ్చు కానీ మీరు ఆసక్తి పెట్టుకోవద్దు. ధర్మాన్ని ఆచరించు, సత్యాన్ని పలుకు, మనస్సుని నిగ్రహించుకో. సంసారంలో ఉన్నంత మాత్రం చేత నువ్వు సాధన విడిచి పెట్టక్కర్లేదు. నువ్వు సాధన చేసుకో కానీ ఆసక్తి పెట్టుకోవద్దు. ఇది భగవంతుడు చెప్పే మాట, మీ ఇంట్లో అన్ని సదుపాయాలు ఉండి నువ్వు సాధన చేయలేకపోతే ఎక్కడో హిమాలయ పర్వతాలకి పారిపోయి సాధన చేస్తావా అని అడిగారు. మన ఇంట్లోంచి బయటకి వెళ్ళిపోయి సాధన చెయ్యగలం అనుకోకండి ఇది అంతా మాయ. మీకు నిజంగా సాధన చేసే ఉద్దేశం ఉంటే మీ ఇంట్లో మీరు చేసుకోండి. కొంతమంది ఏమి చేస్తారు అంటే రేపు రేపు అంటారు. చలం గారు అన్నారు రేపుకి రూపు లేదు అని, భోజనం ఏ రోజుకి ఆ రోజే, కష్టం ఏ రోజుకి ఆ రోజే, సుఖం ఏ రోజుకి ఆ రోజే, భోగం ఏ రోజుకి ఆ రోజే, దుఃఖం అన్నీ ఏ రోజుకి ఆ రోజే. కానీ సాధన మటుకు రేపు, ఆ రేపు అసలు రానే రాదు. మిమ్మల్ని జాగ్రత్తగా సాధన చేసుకోమని, తరించమని, మీకు చేతనైనంత దానం చేసుకోమని, ధర్మాన్ని ఆచరించమని, సత్పురుషుల సహవాసం చెయ్యమని, శాస్త్రాన్ని పరిశీలించమని, సత్యాన్ని ఆచరించమని మీకు చెప్పే నాధుడు ఈ లోకంలో ఎవడు లేడా? అని అడిగారు ఆచార్యులవారు. మరణం వచ్చి మన జుట్టు

పట్టుకోడానికి సిద్ధంగా ఉందన్న సంగతి మనం మర్చిపోకూడదు.

దేహప్రారబ్ధాన్ని బట్టి మంచి రావచ్చు, చెడు రావచ్చు, కీర్తి రావచ్చు, అపకీర్తి రావచ్చు, లాభం రావచ్చు, నష్టం రావచ్చు. అది దేహప్రారబ్ధాన్ని బట్టి జరుగుతూ ఉంటుంది. కానీ ఏమి వచ్చినప్పటికీ సమచిత్తత్వం అంటే సమానమైన మనస్సు మీరు పోగొట్టుకోవద్దు. అదే యోగం. వాసుదేవుడు ఏమి చెబుతున్నాడు అంటే మీరు సంసారంలో ఉండగా మీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఎప్పుడూ ఒకేరకంగా జీవితం వెళ్లదు. కష్టం వస్తూ ఉంటుంది, సుఖం వస్తూ ఉంటుంది. మంచి వస్తూ ఉంటుంది, చెడ్డ వస్తూ ఉంటుంది. ద్వైతం తప్పదు. జన్మ అంటేనే ద్వైతం. అందుచేత ఈ సంసారంలోకి వచ్చిన తరువాత ద్వైతం తప్పదు. కష్ట సుఖాలు వస్తాయి. ఎంత ధనవంతుడికి అయినా విద్యావంతుడుకి అయినా తప్పదు. మనసు యొక్క నిగ్రహం అవసరం. ఏదైనా కష్టం వస్తుంది. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి అది భరించాలి. సోదరమహాశయులారా పూర్వజన్మలో మీరు చేసిన కర్మను బట్టి మీకు ఏదైనా పొంగు రావచ్చు, మంచి రావచ్చు. దాన్ని బట్టి అహంకారం పెంచుకోకండి. గర్వం పెంచుకోకండి. అది చాలా ప్రమాదం. మీరు ఎంత అయితే పొంగి పోయారో తరువాత భవిషత్ జన్మలో అంతవరకు కృంగిపోతారు. దానికి ఎత్తుకి ఎత్తు మీరు దుఃఖం అనుభవించడం తప్పదు. అందుచేత అదృష్టవశాత్తు మీకు ఏదైనా కలిసిరావచ్చు. దానిని చూసి మీరు గర్వం తెచ్చుకోకండి, పొంగిపోకండి. దురదృష్టవశాత్తు మీకు ఏదైనా నష్టం రావచ్చు అంతమాత్రం చేత మనసుని కంగారు పెట్టుకోకండి. అప్పుడు ఇప్పుడు కూడా ఎటువంటి పరిస్థితులలో కూడా నీ మనసుని సమానంగా ఉంచుకో, నీ మనసుని కదలనివ్వకు, నీ మనసుని మెదలనివ్వకు, నీ మనస్సుని చెదరనివ్వకు. నీ మనసుని మటుకు balancedగా, నిదానంగా ఉంచుకో ఎటువంటి పరిస్థితులు వచ్చినా సరే నువ్వు కదలకు అని పరమాత్మ చెపుతున్నాడు. ఉన్నది ఒక్కటే వస్తువు. ఈ లోకం అంతా పెద్ద సున్న అని కృష్ణుడు చెబుతుంటే మీరు దేనికోసం కంగారు పడతారు. దేనికోసం బెంగ పెట్టుకుంటారు. ఇది అనిత్యం, అశాశ్వతం, నువ్వు ఈ లోకంలోకి వచ్చి పడ్డావు. ఈ లోకం దుఃఖమయం. ఇది పెద్ద కల. ఉన్నది ఆత్మ ఒక్కటే. ఇంక దేని గురించి నువ్వు బెంగ పెట్టుకుంటావు, దేని గురించి దుఃఖపడతావు, దేని గురించి బాధ పడతావు. మీలో ఎంతోమంది ఐశ్వర్య వంతులు ఉండచ్చు అది కూడా స్వప్నం మాత్రమే అంటున్నాడు వాసుదేవుడు. అలాగే దురదృష్టం మిమ్మల్ని వెంటాడినప్పుడు, దురదృష్టం మిమ్మల్ని తరిమినప్పుడు మీకు ఏవో కొన్ని కష్టాలు రావచ్చు, అప్పుడు కూడా కృంగిపోకండి. అది కూడా స్వప్నం మాత్రమే, అది కూడా అబద్ధమే. కల అయిన తరువాత చెడ్డ కల అబద్ధమే. మంచి కల కూడా అబద్ధమే. మనం దేనిని చూసి పొంగిపోవటం?

దేనిని చూసి గర్వపడటం? స్వప్నంలో జరిగే సంఘటనలు ఎటువంటివో జాగ్రదావస్థలో జరిగే సంఘటనలు కూడా అటువంటివే అని పరమాత్మ చెపుతున్నాడు.

మీరు దేని గురించి దుఃఖపడుతున్నారు. దుఃఖపడవలసింది ఈ లోకంలో ఏమీ లేదు. దేని గురించి మీరు దుఃఖపడకండి. మన జీవిత ప్రారబ్ధాన్ని బట్టి ఏ సంఘటన జరిగినప్పటికీ ప్రశాంతంగా తీసుకుని మీ మనసుని చెదరనివ్వకుండా సమచిత్తత్వం సమానమైన చిత్తం కలిగి ఉండాలి. అది యోగం. భక్తిలో కూడా కొంతమంది అమావాస్యకి ఒకలాగా పౌర్ణమికి ఒకలాగా ఉంటారు. అలా కాదు స్థిరంగా ఉండాలి. వ్యభిచార భక్తి పనికిరాదు. అవ్యభిచారభక్తి అవసరం. అంటే నిదానంగా ఉండాలి. కొంతమందికి ఎంతసేపు జనం కావాలి. ఏకాంతంగా ఉండలేరు. కానీ ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మరణించిన తరువాత ఏకాంతంగా ప్రయాణం చెయ్యాలి. అప్పుడు మనకి ఎవరు జత ఉండరు. ఇప్పుడు ఏకాంతవాసంగా ఉండలేము అనుకోండి మనం మరణించిన తరువాత మనకి ఎవరైనా జత వచ్చేవాళ్ళని చూసుకుంటారా మీరు? ఇంటికాడ మీ బంధువులకో, పిల్లలకో ఎవరికో పదేసి ఎకరాలు పొలాలు ఇస్తున్నారు కదా, సెటిల్మెంటులు రాసేసారు కదా వాళ్ళు ఎవరైనా మరణానంతరం మనకూడా వస్తారా? మరణించిన తరువాత మనకి జత వచ్చేవాడు ఒక్క గురువు మాత్రమే. పూర్వజన్మల్లో మనం ఏమీ సంబంధం లేకుండానే ఇక్కడ కలుసుకున్నామా? ఈ సంబంధం మనలని మరొక చోట మరొక జన్మలో కలపదా? అన్నారు, వాడు గురువు. భగవాన్ అన్నారు ఓ పెరుమాళ్ళు నువ్వు నా మీద దావా చేశావు. దావా చేయవచ్చు, నన్ను విమర్శించవచ్చు. నా గురించి చెడ్డగా పుస్తకాలు రాయవచ్చు అయినా నువ్వు ఎక్కడికి వెళ్ళినా నరకానికి వెళ్ళినా నిన్ను నేను విడిచిపెట్టను. నీ కోసమే నరకానికి వస్తాను. నాకు నరకానికి వెళ్ళవలసిన పని లేదు. నీకోసం నరకానికి వచ్చి నిన్ను ఉద్ధరించి తీరతాను పెరుమాళ్ళు. కానీ నేను నిన్ను అడిగేది ఒక్కటే నరకానికి వెళ్ళే పనులు ఎందుకు చేస్తావు? వాడు గురువు అంటే, మీరు తాటి రొట్టి పెడతారా? లేకపోతే మినపరొట్టి పెడతారా? మీరు సన్మానాలు చేస్తారా? దండలు వేస్తారా? అని చూసేవాడు గురువా? మీ నుంచి ఏమి పొందుదాము అని వాడు చూస్తుంటే వాడు గురువు ఎలా అవుతాడు? బలరామరెడ్డి గారు భగవాన్ దగ్గర ఒకసారి రామాయణం చదువుతున్నారు సీతమ్మ రామచంద్ర మూర్తి తోటి అంది అట, నాథా ఈ చెరువు ఎంత నిర్మలంగా ఉంది. ఎంత పవిత్రంగా ఉన్నాయో ఈ నీళ్ళు, ఎంత బాగుంది ఈ చెరువు. అంటే అప్పుడు రామచంద్ర మూర్తి నిజమే సీతమ్మ. ఎంత బాగుంది ఈ చెరువు, ఈ చెరువు ఎంత నిర్మలంగా ఉంది. సత్పురుషుల యొక్క హృదయం ఎంత బాగుంటుందో, సత్పురుషుల హృదయం ఎంత

నిర్మలంగా ఉంటుందో, ఈ చెరువులో నీళ్ళు కూడా అంతే నిర్మలంగా ఉన్నాయి అన్నాడు. అని బలరామరెడ్డి గారు చదువుతుంటే ఈ మాటలు విన్న రమణమహర్షి గారి ఒళ్ళు ఒక్కసారి జలధరించింది అట. ఆయన జ్ఞానే, అసలు లోకమే స్వప్నం అనుకునే మనిషి ఆయన అయితే ఒక్కసారి ఒళ్ళు జలధరించింది అట, ఈ రహస్యం ఏమిటి అంటే అక్కడ body react అవుతుంది, మనసులో ఏమీ ఉండదు, హృదయంలో ఏమీ ఉండదు, అటువంటి సన్నివేశాలు చదివినప్పుడు body react అవుతుంది. స్వామి వివేకానంద బ్రతికి ఉండగా ఒకసారి భూకంపం వచ్చింది అట. అప్పుడు భూకంపం రావటం ఈయన ఒళ్ళు చలించటం ఒకేసారి జరిగినవి. అంటే వాళ్ళు లోకం తోటి ఎంత తాదాప్యం పొంది ఉంటారో, అంటే వాళ్ళ హృదయంలో లోకాన్ని ఎంత ప్రేమించి ఉంటారో, ఆ సంగతి మనకి తెలియదు. నీకు ఏమి కావాలో కోరుకో అని ఒకసారి చైతన్యుడు మస్తానుస్వామిని అడిగితే ఓ చైతన్య నాకేమి అక్కర్లేదు కానీ నువ్వు లేని ఈ లోకాన్ని నేను చూడలేను. నువ్వు జీవించి ఉండగానే నన్ను పంపేయి. నువ్వు లేని లోకాన్ని నేను చూడలేను. నా కోరిక ఒక్కటే. నువ్వు జీవించి ఉండగా నీ శరీరం ఉండగా నా శరీరాన్ని ముందు పంపేయ్, అది ఆప్యాయత, గురుశిష్య సంబంధం అది, అందుచేత ఇష్టం జరిగినా, అయిష్టం జరిగినా, ఇష్టం అయిష్టం దేనికండి ఇవన్నీ? ఈ లోకము, ఈ దేహము, ఈ ఇష్టము, ఈ అయిష్టము, ఈ రాగము, ఈ ద్వేషము, కామము, కోరిక, లోభము, ఇవన్నీ మనస్సు యొక్క రాజ్యం. ఇవన్నీ మనో రాజ్యం లోనివే. ఆత్మకు ఎట్టి సంబంధం లేదు. అందుచేత నువ్వు ఏకాంతంగా ఉండి సాధన చేసుకొంటూ నీ మనసుని, బుద్ధిని నా యందు లయం చేసి నిరంతరం నన్ను స్మరిస్తూ కాలక్షేపం చెయ్యి అంటున్నాడు పరమాత్మ.

### అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్వజ్ఞానార్థ దర్శనం

మీరు ఇంటి దగ్గర అనేక పనులు చేసుకోవచ్చు సంసారంలో ఉండవచ్చు కానీ మీ లక్ష్యం మటుకు మోక్షం మీద ఉండాలి, ఆత్మజ్ఞానం మీద ఉండాలి. ఈ మధ్యన ఎవరో రాశారు ఫలానా సాధువు దగ్గరకి వెళితే రోగాలు తగ్గిపోతాయి అని, అసలు మనకు అజ్ఞానం అనే పెద్ద రోగం పట్టుకుంది, అది తగ్గించేవాడు ఎవడు కనపడటం లేదు. ఈ శరీరానికి వచ్చిన రోగం తగ్గిపోతుంది. ఈ రోగం డాక్టరు గారు తగ్గించేస్తారు. పోనీ రోగాలు తగ్గిపోతే మంచిది అసలు ఈ అజ్ఞానం అనే రోగం ఎప్పుడు తగ్గేది? ఈ అజ్ఞానం అనే రోగం ఉన్నంతసేపు శరీరం అనే రోగం వస్తూనే ఉంటుంది. ఇది ఎవడు తప్పించలేడు. అజ్ఞానాన్ని తీసే నాథుడు ఎవడైనా కనిపిస్తున్నాడా? మీకు ఎవరైనా సాయం చేస్తే పది రూపాయలు సాయం చేస్తారు. కానీ మీకు ఏదైనా దుఃఖం ఉంది అనుకోండి మీ బంధువులను ఆ దుఃఖం తీసేయమనండి ఎవరైనా


తియ్యగలరేమో, మీ సన్నిహితులు, సహచరులు, ఆత్మీయులు, ఎంత దగ్గర బంధువులు అయినా సరే మీలో ఉన్న అజ్ఞానాన్ని తీసేయమనండి ఎవరైనా తియ్యగలరేమో, అది ఈశ్వరుడికే సాధ్యం, గురువుకే సాధ్యం. అందుచేత మీరు ఏ పని చేసుకున్నప్పటికీ మీరు రాజులా, బ్రహ్మణులా, వైశ్యులా అని కాదు వ్యవసాయం చేసుకుంటున్నారా? వ్యాపారం చేసుకుంటున్నారా అని కాదు మీరు పొట్టకోసం ఏ వృత్తి చేసుకుంటున్నప్పటికీ, సమాజంలో మీ ఆర్థికపరిస్థితి ఎటువంటిది అయినప్పటికీ మీ లక్ష్యం మటుకు, మీ మనసు మటుకి ఆత్మజ్ఞానం మీదే ఉండాలి, ఉండి తీరాలి. మీరు ఏ వృత్తిలో ఉన్నా సరే, మీరు జపం చేసుకోండి ఏది చేసుకోండి మీ లక్ష్యం మటుకు ఆత్మజ్ఞానం అయి ఉండాలి. మీ మనసుకి ఎంత అయితే శక్తి ఉందో, మీ హృదయానికి ఎంత అయితే శక్తి ఉందో, మీకున్న బుద్ధి యొక్క వైభవం ఎంత ఉన్నా మీ గురి మటుకు ఆత్మజ్ఞానం వైపు ఉండాలి. ఎందుచేతనంటే ఆత్మ నిజం అని చెప్పలేదు రమణమహర్షి, ఆత్మ ఒక్కటే నిజం అన్నారు. ఎంత బాగా చెప్పారో చూడండి. ఆత్మ నిజం అని చెప్పలేదు ఆయన, ఆత్మ ఒక్కటే నిజం. ఇక్కడ భగవంతుడు చెబుతున్నాడు నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీ దేహయాత్ర కోసం ఏ పని చేసుకుంటున్నప్పటికీ మీ లక్ష్యం మటుకు ఆత్మ మీదే పెట్టు. అది ఎన్నడూ మర్చిపోకు, అది మర్చిపోయావా నువ్వు జన్మ జన్మలకి విషాదంలో పడిపోతావు. జన్మ జన్మలకి దుఃఖంలో పడిపోతావు. ఆత్మజ్ఞానం యొక్క వైభవం, ఆత్మ యొక్క గొప్పతనం నీకు ఏమి తెలుస్తుంది? మహాత్ములకు, మేధావులకి తెలుస్తుంది. ఒకసారి అమెరికా నుండి ఒక సైంటిస్టు వచ్చాడు పెద్ద సైంటిస్టు అతను నోబెల్ ప్రైజ్ విన్నర్ అతను. అతను రమణమహర్షి గారి దగ్గర ఒక అరగంట కూర్చున్నాడు అమెరికా వెళ్ళిపోయాడు. అమెరికాలో ఒక క్లబ్ లో ఇతనిని ఆహ్వానించి మీరు ఇండియా వెళ్ళిచూసి వచ్చారు కదా ఇండియాలో ఏమి చూశారు అని అడిగారు. ఆ సైంటిస్టు ఒక మాట చెప్పాడు. సౌత్ ఇండియాలో తిరువణ్ణామలై అని ఒక టౌన్ ఉంది. అక్కడ రమణ స్వామి అనే పేరుగల ఒకమహాత్ముడిని చూశాను. ఆ మహాత్ముడిని చూడకముందు నేను చాలా గొప్పవాణ్ణి అనుకునేవాడిని. ఈ లోకంలో సైన్స్‌లో ఎన్నో ఘనకార్యాలు చేశాను. నేను చాలా గొప్పవాణ్ణి నా జీవితం ధన్యం అయ్యింది అని ఇంతకాలం అనుకుంటున్నాను. ఒక్కసారి రమణమహర్షిని చూశాక జీవితంలో నేను ఏమి సాధించలేదు అని నాకు అనిపించింది. నేను ఆయనతోటి మాట్లాడలేదు. ఆయన నాతోటి మాట్లాడలేదు. ఒక అరగంట ఆయన దగ్గర కూర్చున్నాను. ఆయనని చూసిన తరువాత నాకు తెలిసింది. ఏమని తెలిసింది? నాకేమి తెలియదు అని, నేను సాధించింది ఏమీ లేదు అని, నేను నేర్చుకోవల్సింది జీవితంలో ఎంతో ఉందని, ఆయనని చూసిన తరువాత తెలుసుకున్నాను. ఇండియా వెళ్ళి నేను నేర్చుకున్న విషయం ఇది అని ఆ సైంటిస్ట్ చెప్పాడు. అదండీ జ్ఞానం

యొక్క వైభవం. సోదరమహాశయులారా మీ బిడ్డలు విద్యావంతులు అవ్వాలని, ధనవంతులు అవ్వాలని, కీర్తి వంతులు అవ్వాలని ఇలా కోరుకుంటున్నారు కానీ మీ బిడ్డలు జ్ఞానులు అవ్వాలని ఎవరైనా కోరుకుంటున్నారా? జ్ఞానం యొక్క విలువ నిజంగా నీకు తెలిసి ఉంటే అది మీరు సాధించలేక పోయినా, నా మనవడు అయినా జ్ఞాని అవ్వాలని కోరుకునే వాళ్ళు ఒకరు అయినా ఉన్నారా ఇక్కడ? ఇనుపముక్కల్లో ఉన్న దేవుడిని, సిమెంటులో ఉన్న దేవుణ్ణి, చూడటం మీకు అందరికి ఇష్టం కానీ రక్త మాంసాలతో ఉన్న దేవుడిని చూడటం మీకు ఇష్టం లేదా? అంటే మీకు అబద్ధమే కానీ నిజం ఇష్టం ఉండదా? మీరు నిజం తెలుసుకోలేకపోవచ్చు కానీ నిజం యందు అభిలాష లేదా? నిజాన్ని ప్రేమించలేరా? ఒక రామకృష్ణుడో, ఒక రమణుడో మనం అవ్వలేకపోవచ్చు కానీ వాళ్ళని గౌరవించే శక్తి కూడా మనకి లేదా? తత్వం. తత్ అది, త్వం నీవు. అది నీవే. శరీరం నీవు కాదు. నీ కోరిక నీవు కాదు. నీ మనసు నీవు కాదు. ఆ బ్రహ్మమే నీవు. మీరు దేన్నయితే కోరుతున్నారో, దేనికోసం అయితే అన్వేషిస్తున్నారో, మానవజాతి దేనిని తెలుసుకోవటంకోసం పరుగు పెడుతుందో అది నీవే. ఇండియన్స్ కాదు, అమెరికన్స్ కాదు, రష్యన్స్ కాదు, ఫిలాసఫర్స్ కాదు, సైంటిస్టులే కాదు, డాక్టర్స్ కాదు, లోకంలో ఉండే విజ్ఞానం అంతా కూడా లోకంలో ఉన్న మానవజాతి అంతా కూడా ఏ గమ్యాన్ని తెలుసుకోవడానికి పరుగుపెడుతోందో, ఏ వస్తువును గ్రహించడం కోసం కోట్లాది రూపాయలు burn చేస్తున్నారో, ఆ వస్తువు నీవే, ఆ బ్రహ్మము నీవే, ఆ తత్వము నీవే. నీవు యల్లమ్మ అనుకుంటున్నావు, సుబ్బమ్మ అనుకుంటున్నావు. నువ్వు యల్లమ్మ కాదు, నువ్వు సుబ్బమ్మ కాదు, అది నీవే. ఆ బ్రహ్మము నీవే. దాన్ని లక్ష్యంగా పెట్టుకో, దానిని మర్చిపోకు. దానికోసం జీవించు, అవసరం అయితే దానికోసం మరణించు. రోగం వచ్చి మరణించిన వాడికి కాదు జ్ఞానం రావటం. ఆత్మ కోసం మరణించిన వాడికి జ్ఞానం వస్తుంది. జ్ఞానాన్ని ప్రేమించండి, జ్ఞానం పట్ల మీ హృదయంలో ప్రీతిని పెంచుకోండి. జ్ఞానం కోసం జీవించండి. మీరు అందరూ జ్ఞానులు కండి, తరించండి, దుఃఖానికి దూరం కండి.


**హే భగవాన్ జయ భగవాన్ ప్రియ భగవాన్ ప్రభు భగవాన్**

**హే భగవాన్ జయ భగవాన్ ప్రియ భగవాన్ ప్రభు భగవాన్**

**అన్ని పుస్తకాలలో మనస్సుని నిగ్రహించుకోమని చెబుతుంటే మనస్సుని నిగ్రహించుకోవటం మానేసి పుస్తకాలు చదవటం పని కింద పెట్టుకుంటే ఇంక మనస్సు ఎలా ఆధీనంలోకి వస్తుంది?**



# రామకృష్ణుడు



మార్చి 15వ తేదీ రామకృష్ణ పరమహంస జయంతి. రామకృష్ణుడికి ఆయన చిన్నప్పటినుంచీ నేను ఒక అవతార పురుషుడి పనిచేయటానికి ఈ లోకంలోకి వచ్చాను, సామాన్యమైన పనిచేయటానికి రాలేదు అని స్ఫురించేదని సద్గురు శ్రీ నాన్నగారు అన్నారు. రామకృష్ణుడి గురించి నాన్నగారు చెప్పిన కొన్ని విషయాలు.

**హృదయం ప్రధానం, బాహ్య ప్రక్రియలు కాదు!**

రామకృష్ణ పరమహంస గారు చదువుకోలేదు. పెన్సిల్ ని పెనసల్ అనేవారు. ఆయన లోకానికి గురువు అయ్యారు!ఆయన దగ్గరికి ఎంతో ధనవంతులు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ లాంటి పెద్దపెద్ద పండితులు, లేకపోతే బంకిమ్‌చంద్రచట్టర్జీ లాంటి కవులు వచ్చేవారు. వాళ్ళకి ధనం ఉంది,పాండిత్యం ఉంది, కలకత్తా లో పేరుప్రఖ్యాతులు ఉన్నాయి, కానీ లోపల వాళ్ళ హృదయంలో ఏది ఆరాధిస్తున్నారు. వాళ్ళ కళ్లలోకి చూసేవాడు కాదు, వాళ్ళ హృదయంలోకి చూసేవాడు రామకృష్ణుడు. మీ హృదయాంతరాళంలో ఏముంది. మీరు ధనవంతులు అవ్వచ్చు, పండితులు అవ్వచ్చు, కానీ హృదయంలో దేనిని ఆరాధిస్తున్నారు? మీరు హృదయంలో కామినీ కాంచనాలలోనుంచి బయటికి వచ్చారా లేదా? మీరు హృదయంలో లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన లేకుండా ఉన్నారా, అని హృదయం వంక చూసేవాడు. అవి కనుక ఉంటే తీసేసిన కొబ్బరికాయలలాగా, వాళ్ళకి వెయ్యికోట్ల ఆస్తి ఉన్నా వాళ్ళని పంపేసేవాడు -వాడు రామకృష్ణుడు!

నువ్వు హృదయంలో ఎలా ఉన్నావు అనేది ముఖ్యం. నీకు వెయ్యి కోట్ల ఆస్తి ఉంటే ఉండనియ్యి, ఆ వెయ్యి కోట్లు దాచుకో, నువ్వు హృదయంలో దేనిని ఆరాధిస్తున్నావు? హృదయంలో కామినీ కాంచనాలను ఆరాధిస్తున్నావా లేదా. నువ్వు వచ్చావు, రైటే, నువ్వు ఏదో ఉపనిషత్తులు నేర్చుకున్నావు. కానీ నీ హృదయంలో ఏమి ఉంది? నీకేమైనా తోక తెగిందా? తోక అంటే, దేహాభిమానం కానీ, దేహబుద్ధి కానీ నీకేమైనా తెగిందా?ఇలా అని ఎంతటి వాడైనా ఎటువంటి

వాడైనా వెళ్లిరమ్మని బయటికి పంపేసేవాడు. నీకు డబ్బు ఉన్న మాట నిజమే, పాండిత్యం ఉన్న మాట నిజమే, నువ్వు కలకత్తాకి మేయర్ చేస్తున్నావు. కానీ ఇవన్నీ ఎందుకయ్యా నీకు తోక తెగనప్పుడు. ఇవన్నీ ఏమిటి అంటే, ఊరికే పైన ఉన్నటువంటి మెరుపులు. దీనికి జ్ఞానానికి సంబంధం ఏమిటి? నీ డబ్బుతోటి, నీయొక్క చదువు తోటి, నీకున్న గౌరవాలతోటి, నీకున్న అధికారం తోటి, నీ అహంకారాన్ని అలంకరించుకొంటున్నావు. కానీ నీ మనస్సు అంతర్ముఖమై, నీ ముఖం అసలు జ్ఞానం వైపుకి తిరిగిందా లేదా. అది రామకృష్ణుడి ప్రశ్న!

మీ శరీరం వంక చూసేవాడు కాదు. లోకంలో భౌతికమైన ఎంత గొప్ప సౌందర్యం ఉన్నా ఆయన ఎప్పుడూ ఆకర్షింపబడలేదు - వాడు రామకృష్ణుడు. బాగా అందమైనవాళ్ళ గురించి షేక్స్పియర్ “బ్యూటీవాక్స్ఆన్దిఎర్త్”అనేవాడు. సౌందర్యం వచ్చి భూమి మీద నడుస్తోంది అని చెపుతాడు. అటువంటి వాళ్ళ వల్ల కూడా రామకృష్ణుడు ఎప్పుడూ ఆకర్షింపబడలేదు. అవన్నీ ఫ్లెష్ అండ్ బ్లడ్ కి సంబంధించినవి. ఈవేళ మీకు సౌందర్యం ఉంటే, రేపు పోవచ్చు, ఓల్డ్ ఏజ్ వచ్చాక, సౌందర్యం ఏమిటి ఇంక!

ఎవరైనా సరే, వాడి హృదయంలో ఏముంది అని, స్కానింగ్ చేసినట్టు లాగేసేవాడు. డాక్టరుగారు మీ శరీరంలో ఏమి రోగం ఉందని అడుగుతారు, మీరేమీ లేదు అని అనవచ్చు, కానీ స్కానింగ్ లో మీరు దొరికేస్తారు. కాన్సర్ ఉంటే కాన్సర్ అని తెలిసిపోతుంది, టిబి ఉంటే టిబి ఉందని తెలిసిపోతుంది. అలా రామకృష్ణుడు మీ హృదయంలో స్కానింగ్ చేసినట్టు లోపల చూసేవాడు.

నీ హృదయం వంక చూసేవాడు రామకృష్ణుడు. నీకు తోక తెగిందా? తోక అంటే ఆయన ఉద్దేశం ఏమిటంటే, దేహానికి పరిమితమైన బుద్ధి. “దేహమే నేను”అనే బుద్ధి, నాకు ఒక శరీరం ఉంది అనుకోవటం వేరు, నేను ఈ శరీరాన్ని అనుకోవటం వేరు. “దేహమే నేను అనే బుద్ధి” ఎవడికైతే ఉందో వాడికి తోక తెగలేదు అని ఆయన పరిభాషలో రామకృష్ణుడు చెప్పేవాడు. ఈ బయట గొడవలు అక్కరలేదు ఆయనకి. లోపల హృదయంలో నువ్వు దొరికిపోతావు కదా. హృదయంలో ఎవరిని ఆరాధిస్తున్నావు నువ్వు. లోపల హృదయంలో కామినీ కాంచనాలను ఆరాధిస్తూ నువ్వు ఎవరికి ఏమి బోధిస్తావు. నీకు అధికారం ఇచ్చిన వాడు ఎవడు. నువ్వు అసలు హృదయంలో ఎలా ఉన్నావో చూసుకో అన్నాడు రామకృష్ణుడు. నీకు తోక తెగలేదు, అంటే దేహాభిమానం పోలేదు. నీకు చదువు ఉన్న మాట నిజమే, డబ్బు

ఉన్న మాట నిజమే. నీ శరీరం ఎంత నిజమో, నీ మనస్సు ఎంత నిజమో, ఆ డబ్బు అంతే నిజం, ఆ చదువు అంతే నిజం.

పుస్తకాలు చదవటం వలన, బాహ్య ప్రక్రియల వలన మీకు జ్ఞానం రాదు. ఏవో మంచి పనులు చేసినంత మాత్రం చేత మీకు జ్ఞానం రాదు. మనలో ఉన్న అజ్ఞానం పోవాలి. పరమేశ్వరుని దయవలన మీలో ఉన్న అజ్ఞానం పోవాలి కానీ ఏవో బజారులో మందులు కొనుక్కొని అజ్ఞానాన్ని పోగొట్టుకోలేము. పరమేశ్వరుని దయ అనే మందు నీకు దొరకకపోతే ఈ అజ్ఞానం బయటికి పోదు. త్యాగబుద్ధి లేని వాడికి గీత ఎన్నిసార్లు చదివినా అది అర్థం కాదు అని రామకృష్ణుడు చెప్పాడు. చదవటం వలన నీకు శబ్దానికి అర్థం తెలియవచ్చు కానీ మీకు త్యాగబుద్ధి లేకపోతే గీత దాని హృదయాన్ని మీకు ఇవ్వదు అని చెప్పాడు.

నీ జీవితంలో కనీసం ఒక్కడికైనా సహాయ సహకారాలు అందించావా? మీరు వంద మందికి ఉపకారాలు చేయలేక పోవచ్చు, సహాయం చేయలేకపోవచ్చు. వందమందికి మనం సహాయం చేయలేమని కనీసం ఒకరికైనా సహాయం చేయటం మానకండి. యిట్ ఈజ్ గ్లోరియస్ ఈవెన్ టు హెల్ప్ ఒన్ మేన్ అని అంటూ ఉండేవాడు రామకృష్ణుడు.

ఆయనలో గొప్ప తనం ఏమిటంటే, నువ్వు బీదవాడివా ధనవంతుడివా అని చూడడు. వాడు రిచ్ మాన్ అవ్వచ్చు, పూర్ మాన్ అవ్వచ్చు, సమాజంలో వాడికి గుర్తింపు వుండవచ్చు లేకపోవచ్చు, కానీ ఆయన సమానంగా అనుగ్రహిస్తాడు. లోకానికి సంబంధించిన హెచ్చుతగ్గులు కానీ, అంతస్తులు కానీ ఇవేమీ ఆయన దృష్టిలో పెట్టుకోడు.

రామకృష్ణుడు వాసనల గురించి మాట్లాడటమే కాదు, ఆ వాసనలను సర్జరి చేసి తీసేసి బాధలు తొలిగించేవాడు. ఆ శక్తి ఆయనకి త్రికరణశుద్ధి వలన వచ్చింది.

రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే దేవుడికి ఆకారం ఉంటే ఏముంది లేకపోతే ఏముంది, మీరు మిఠాయి అడ్డంగా తిన్నా నిలువుగా తిన్నా మిఠాయే, ఎలా తిన్నా ఒకటే తీపి కదా. దేవుడికి ఆకారం ఉండవచ్చు, దేవుడికి ఆకారం లేకపోవచ్చు. ఆ పేచీల జోలికి వెళ్ళకండి. దేవుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, వాడికి గుణాలు ఉండవచ్చు లేకపోవచ్చు. వాడు నిర్గుణుడు అవ్వవచ్చు, సగుణుడు అవ్వవచ్చు. వాడు నిరాకారుడు అనవచ్చు, సాకారుడు అనవచ్చు. కానీ ఉన్నాడు! నువ్వు లేడు అనుకున్నంత మాత్రం చేత ఉన్నవాడు ఎక్కడికీ పోడు. లేడు అంటే అది నీ అజ్ఞానానికి గుర్తు. వాడు కర్మ ఫల దాత. మీరు చేస్తున్న మంచి

పనులకి చెడ్డ పనులకి ఎప్పుడు అనుసంధానం చేయాలో వాడు చూస్తూ ఉంటాడు. వాడు అడ్మినిస్ట్రేటర్! వాడు ఉన్నాడు, వాడికి ఆకారం ఉందా లేదా, వాడికి గుణాలు ఉన్నాయా లేవా, ఈ గొడవలు అనవసరం. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు వాడిని విశ్వసించండి, విశ్వసిస్తే నోట్లో సొమ్ము లేకపోతే దుమ్ము!

రామకృష్ణుడికి చివరి రోజులలో కంఠంలో కేన్సర్ వచ్చింది. మజ్జిగ కూడా లోపలకు వెళ్లటంలేదు. అప్పుడు శిష్యులు అంటారు, ఓ రామకృష్ణ దేవా, మేము ఇంతమంది శిష్యులం ఉండి కనీసం నీకు మజ్జిగ కూడా ఇవ్వలేకపోతున్నాము. అని బాధపడతారు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు, ఓ నరేన్, ఈ నోరే తినాలా, ప్రపంచంలో ఎన్నో నోరులు ఉన్నాయి. ఆ నోర్ల ద్వారా తినేవాడిని నేనే కదా. ఈ నోరు తింటేనే నేను తిన్నట్టా లేకపోతే నేను తినటం లేదా! అంటే అక్కడ ఉన్నది దేహగతమైన నేను కాదు, అది యూనివర్సల్ ఐ, అది నిజమైన నేను.

లోపల ఉన్న తత్త్వం వాక్కుకి అందదు, మనస్సుకు అందదు, బుద్ధికి అందదు, అని శాస్త్రంలో ఉన్న మాటలు ఆయన చెప్పేవారు కాదు. ఇవన్నీ చిలకపలుకులు అని ఆయనకి తెలుసు. మనస్సుకు అందదా, ఎక్కడ చదివావు నువ్వు? అపవిత్రమైన మనస్సుకు అందదు. పవిత్రమైన మనస్సుకి అందకుండా ఎక్కడికి పోతుంది. నీకు అర్హత లేనప్పుడు, యోగ్యత లేనప్పుడు, నారాయణుడు నీకు అందడు. నీ బుద్ధిలో దోషాలు ఉంటే, నీ మనస్సులో దోషాలు ఉంటే, ఆయన నీకు అందడు కాని పరమపవిత్రుడికి కూడా వాడు అందకుండా పోతాడా? అలా అందకపోతే వాడు భగవంతుడు ఎలా అవుతాడు అన్నారు రామకృష్ణ పరమహంస!


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# మహాశివరాత్రి

ప్రతీ సంవత్సరం మాఘమాసం కృష్ణపక్షం చతుర్దశి రోజున మహాశివరాత్రి పర్వదినాన్ని జరుపుకుంటాం! అవ్యక్తమైన, నిరాకారమైన పరమాత్మ లింగరూపం ధరించిన రోజు మహాశివరాత్రి. దేశ, కాలాలలో ప్రతీ సంవత్సరం జరుపుకునే శివరాత్రి, నిజమైన శివరాత్రికి గుర్తు, అనగా మన గమ్యాన్ని గుర్తు చేసే రోజు. సాధారణంగా మన సంప్రదాయంలో అనేక పండుగలు, పర్వదినాలు జరుపుకుంటాం! పండుగ అనగానే, విందులు, వినోదాలు, గుర్తుకొస్తాయి. కానీ మహాశివరాత్రి విభిన్నమైన పర్వదినం, కారణం శివరాత్రి రోజున ఉపవాసం మరియు జాగరణ చేస్తాం! శివుడు అంటే మంగళప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు. శివుడు ఆదిదేవుడు. శివుడు అంతర్యామిగా హృదయంలోనే ఉన్నాడు. శివుడు అంటే, సంసార దుఃఖాన్ని పోగొట్టేవాడు; ద్వైతబుద్ధిని ధ్వంసం చేసేవాడు! శివుడికి - జీవుడికి మధ్యగల అభేద సంబంధాన్ని గుర్తుచేసేరోజు. ఏనాటికైనా గురువు అనుగ్రహం వల్ల, దేహాత్మబుద్ధి నశించి, వాస్తవంగా తాను ఏదిగా ఉన్నాడో, ఆ పరమసత్యంలోకి మేలుకుంటే 'తాను' అమృతుడవుతాడు, ఆ మేలుకొలుపే మహాశివరాత్రి! అహంకారంతో బ్రతికిన రోజులన్నీ అబద్ధమే అని గ్రహించవలసినరోజు. మానవ స్వరూపము, స్వభావము సత్యము, శివము, సుందరము. కాని అహంకార, మమకార, రూపంలో ఉన్న దేహాభిమానం నశించకుండా ఆత్మజ్ఞానం కలగదు. జన్మకోశివరాత్రి అంటాం! అనగా వంద సంవత్సరాలు అహంకారంతో, అజ్ఞానముతో, బానిసలా బ్రతకడం కన్నా, ఒక్కరోజు జీవన్ముక్తునిగా బ్రతికినా చాలు. మన స్వరూప సచ్చిదానంద స్థితిని ఒక్కరోజు అనుభవించినా చాలు. శివుడు ఆదియోగి, కర్మయోగి, పరమవైరాగ్యమూర్తి, జ్ఞాన సంపన్నుడు. అట్టి శివుని స్మరించి, ధ్యానించి, ఆయనతో మనకి ఉన్న అభేద సంబంధాన్ని గుర్తించి, శరీరం మరణించేలోపే మరణంలేని స్థితిని పొందాలి. 'మహాశివరాత్రి' మనందరికి అవిద్యా నిద్ర నుండి మేల్కొనవలసిన ఆవశ్యకతను గుర్తుచేస్తుంది.

**(శివాయ గురవే నమః)**

**(ది॥ 11-03-2021 మహాశివరాత్రి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# వ్యక్తికి జ్ఞానోదయం కలిగితే వారి ప్రతీమాట సత్యమౌతుంది

స్నానము చెయ్యటం వల్ల బాహ్యశుద్ధి కలుగుతుంది, సత్యం పలుకటం వల్ల అంతఃశుద్ధి కలుగుతుంది. అది సత్యాన్ని పట్టి ఇస్తుంది, వారి ప్రతీమాట వేదతుల్యమౌతుంది. శ్రీనాన్నగారు "ముని మనస్సును అంతర్ముఖం చెయ్యటానికి మాత్రమే ఆయన మాట్లాడుతాడు. జ్ఞాని దర్శనం చాలు మన మనస్సులోని బలహీనతలు తియ్యగలడు. శాస్త్రవేత్త సామాజిక స్పృహతో చెప్పబడుతుంది" అన్నారు. బాపూజీ "నేను ఆలోచించి శ్రమతో మాట్లాడిన మాటలు ఏమీ లేవు, నేను చేసే ప్రతీ పనికి ఈశ్వరుడే పలికిస్తాడు. నా చేతలు, పనులు అన్నీ ఈశ్వర ప్రేరితాలే. నేను ఈ రాజ్‌కోట ప్రయాణానికి ఎందుకు వెడుతున్నానో నాకే తెలియదు. ఈశ్వరుడే నడిపిస్తున్నాడు. ఉప్పు సత్యాగ్రహం ఏమిటి? అన్నారు ప్రజలు. దేశ స్వాతంత్ర్యంలో అది ఊపు వూపింది" అన్నారు. జీసెస్ "దైవ రాజ్యాన్ని ముందు సంపాదించు. అవసరాలు అన్నీ వాటంతట అవే సమకూరుతాయి" అన్నారు. ఆధ్యాత్మికతపై పదునెనిమిది గ్రంథాలు రచించిన మౌలానా "రూమి" అనే ప్రఖ్యాత పరిషయన్ కవి ఒక మహనీయుని వద్దకు ఆధ్యాత్మిక అనుభవం కోసం వెళ్ళగా ఆయన "నీకు అనుభవ జ్ఞానం కావలసినచో నీవు వ్రాసిన గ్రంథాలన్నీ నదిలో పారవైచి రా" అని ఆదేశించాడు. తదుపరి అలా చేసి కృతార్థుడను చేసారు వారి గురువు. ఆవు బొమ్మ గీచి చుట్టూ పచ్చగడ్డి వేస్తే పాలు ఇయ్యదు. సజీవమైన ఆవునే మేపుకొంటే పాలు ఇస్తుంది. అలాగే జ్యోతి చిత్రం గీసి వెలుగునియ్యదు. ప్రమిదలో నూనె వెలిగిస్తే వెలుగు వస్తుంది. అలాగే నిజ గురువును చేరాలి. "పుస్తకాల పురుగుల వల్ల జ్ఞానం రాదు, గురుముఖతా రావలసినదే" అన్నది శాస్త్ర ప్రమాణం. అనుభవజ్ఞానం కలిగితే ప్రతీమాట వేద తుల్యమౌతుంది. ప్రేమ గురువులు వీరు తమ అంతఃప్రేరణల ఆధారంగా చేసుకొని ఇతరులకు గమ్యాన్ని చూపుతారు. గతంలోని మన సంస్కారాలు మనకు తెలియవు. గురువును ఆశ్రయిస్తే మన సంస్కారాలను క్రమపద్ధతిలో నేర్పుతో బోదలతోను సంకటాలను కల్పించి దానిలో లేమితనాన్ని బుద్ధికి అందచేసి వివేకం కల్పించి వాటిని తొలగించుకొనేలా చేస్తాడు. దానికి వారు విసుగు విరామం లేకుండా అంతులేని దయగల ప్రేమ గురువుల వల్లనే సాధ్యమౌతుంది. ఆ గురువు ఎలా సమకూరుతాడు అంటే వేమన "గొట్టెలు పదివేలు కూడియుండినచోట, తల్లి నెటిగి వచ్చు దాని కొదుమ, పరమ యోగి నెరిగి భక్తుండు వచ్చురా" అన్నారు. ఇతరులపట్ల మితంగా వ్యవహరించాలి, సందర్భోచితంగా మాట్లాడాలి, విషయాన్ని దాటి మాట్లాడరాదు. తన వ్యక్తిగత రహస్యాలను ఇతరులకు తెలియనివ్వరాదు. ఇలా ఎన్నో జాగ్రత్తలతో సమాజంతో వ్యవహరించేటప్పడే అలవరచుకోవాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966